Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU




అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 337 పేజీలు (Pages): 8 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)
గురువారం, 27 - 8 - 2026
94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## అన్ని విధాలుగా అండగా ఉంటాము : నేపాల్ ప్రధానికి మోదీ ఫోన్



**ఇంటర్నెట్ డెస్క్:** ఆకస్మిక వరదలతో నేపాల్ అతలాకుతలమైన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ సంఘీభావం తెలిపారు. నేపాల్ ప్రధాని బాలెన్ షాతో ప్రధాని నరేంద్ర మోదీ తాజాగా ఫోన్‌లో సంఘీభావం తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో అన్ని రకరాల సహాయ సహకారాలు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఎక్స్ వేదికగా ఈ విషయాలను ప్రధాని వెల్లడించారు. భారత్ నేపాల్‌కు అన్నిరకాలుగా అండగా ఉంటుందని ప్రధాని మోదీ భరోసా ఇచ్చారు. ఇప్పటికే భారత సహాయక బృందాలు నేపాల్ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాయని తెలిపారు. మరోవైపు, నేపాల్‌కు మానవతా సాయం పంపించేందుకు కూడా సిద్ధమవుతున్నామని ఎయిర్‌ఫోర్స్ అధికారులు తెలిపారు. ఔషధాలు, రేషన్ సామాన్లను నేపాల్‌కు పంపించనున్నట్టు చెప్పారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థకు చెందిన బృందాలను కూడా నేపాల్‌కు పంపించే యోచనలో ఉన్నా మని సంబంధిత వర్గాలు తెలిపాయి. రసువా జిల్లాలోని భోటే కోశీ నదిలో అకస్మాత్తుగా పోటెత్తిన వరదలతో 22 మంది మరణించిన విషయం తెలిసిందే. మరో 400 మంది గల్లంతయ్యారు. 105 మంది భారతీయులు కూడా ఈ వరదల్లో గల్లంతైనట్టు తెలుస్తోంది. మరోవైపు, అక్కడి భారతీయుల సహాయార్థం నేపాల్‌లోని ఇండియన్ ఎంబసీ ఎమర్జెన్సీ నెంబర్లను ప్రకటించింది. +977 985 131 6807, +977 970 910 7500 నెంబర్లపై తమను సంప్రదించవచ్చని చెప్పింది.

## జనవరి 1 నుంచి సంజీవని సేవలు : సీఎం చంద్రబాబు



**అమరావతి, (రాజధాని వార్తలు):** 2027, జనవరి 1వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సంజీవని సేవలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. బుధవారం రాజధాని అమరావతిలో వైద్య ఆరోగ్య సేవలు, సంజీవని ప్రాజెక్ట్ సేవలపై ఆయన సమీక్షించారు. కుప్పం, చిత్తూరు ప్రాంతాల్లో అమలు చేసిన ప్రాజెక్ట్ ఫలితాలను ఆధారంగా చేసుకుని కార్యాచరణ రూపొందించాలని వారికి సీఎం సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఏఐ ఆధారిత ఆరోగ్య సేవలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి వీర పాండ్యన్‌తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## భారీగా డిఫెన్స్ మద్యం బాటిళ్లు స్వాధీనం.. ఒకరి అరెస్ట్



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** నగరంలోని తార్నాక ప్రాంతంలో నిర్వ హించిన దాడుల్లో భారీగా డిఫెన్స్ మద్యం బాటిళ్లను ఎన్‌ఫోర్స్ మెంట్ టీం స్వాధీన పరుచుకుంది. మొత్తం 67 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుంది. వీటి విలువ రూ.2లక్షలు ఉ ంటుం దని వివరించింది. తార్నాకలో ఓ వ్యక్తి డిఫెన్స్ మద్యం బాటిళ్లు విక్రయి స్తున్నట్లు.. ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంకు సమాచారం అందింది. దీంతో ఆ ఇంటిపై బుధవారం దాడి చేసింది. ఈ నేపథ్యంలో ఆ ఇంటి యజమాని వద్ద తొలుత పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసు కుంది. అనంతరం ఆ ఇంట్లో సోదాలు చేపట్టింది. ఈ సంద ర్భంగా మరో 57 బాటిళ్లను గుర్తించింది. వాటిని కూడా స్వాధీనం చేసుకుంది. పట్టుబడిన బాటిళ్లు కర్ణాటక, హర్యానా రాష్ట్రాలకు చెందినవని స్పష్టం చేసింది. ఈ మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న వ్యక్తి.. మాజీ సైనికుడి కుమారుడు ఆర్. మాధవన్‌గా గుర్తించా మని పేర్కొంది. అతడిని సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు అప్పగించామని ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం వివరించింది.

## సముద్రంలో గల్లంతైన ఏడుగురు కోనసీమ మత్స్యకారులు క్షేమం




**కోనసీమ, (రాజధాని వార్తలు):** సముద్రంలో గల్లంతైన కోనసీమకు చెందిన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ లభ్యమైంది. బెంగాల్–ఒడిశా బోర్డర్‌లో మత్స్యకారుల ఆచూకీని మరో బోటు సిబ్బంది గుర్తిం చారు. గల్లంతైన మత్స్యకారులంతా క్షేమంగా ఉన్నట్లు సమాచా రం అందడంతో వారి కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ఆగస్టు 3న కోనసీమ జిల్లా ఓడలరేవు ఫిషింగ్ ల్యాండింగ్ సెంటర్ నుంచి IND-AP-E8-MO-135 'ముత్యాలమ్మ' బోటులో ఏడు గురు మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లారు. అనంతరం వారు గల్లంతయ్యారు. అప్పటి నుంచి వారి ఆచూకీ కోసం అధికారులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. తాజాగా పశ్చిమ బెంగాల్‌లోని దిగా ప్రాంతం వద్ద మరో బోటు సిబ్బంది.. గల్లంతైన బోటును గుర్తించారు. అందులో ఉన్న ఏడుగురు మత్స్యకారులు సురక్షితంగా ఉన్నట్లు నిర్ధారించారు. ఇంజిన్ చెడిపోవడం వల్లే మత్స్యకారులు ప్రయాణిస్తున్న బోటు కొంతకాలంగా కదలలేని పరిస్థితిలో సముద్రంలోనే ఉ ండిపోయినట్లు తెలుస్తోంది. ఏడు గురు మత్స్యకారులను గుర్తించిన మరో బోటు సిబ్బంది.. ఇంజిన్ పనిచేయని బోటును మరో బోటుకు కట్టి ఒడ్డుకు తీసుకు వస్తు న్నట్లు తెలుస్తోంది. దాదాపు 23 రోజుల తర్వాత మత్స్యకారులు క్షేమంగా ఉన్నారనే సమాచారం అందడంతో వారి కుటుంబ సభ్యులు, బంధువులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**మత్స్యకారుల భద్రత, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం : మంత్రి అచ్చెన్న**

సముద్రంలో గల్లంతైన ఏడుగురు కోనసీమ మత్స్యకారులు సురక్షితంగా ఉన్నారని మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. మత్స్యకారుల ఆచూకీ కోసం ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పని చేసిందన్నారు. జిల్లా కలెక్టర్, కమిషనర్, మత్స్యశాఖ జేడీ, ఎఫ్‌డీవోలకు మంత్రి అభినందనలు తెలియజేశారు. మత్స్యకారులను స్వస్థలానికి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని, పశ్చిమ బెంగాల్ వెళ్లాలని అధికారులను ఆదేశించారు. మత్స్యకారుల భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## ఇతరులకు నీతులు చెప్పే ముందు చరిత్ర చూసుకోవాలి జగన్ : మంత్రి సత్యకుమార్ యాదవ్



**అమరావతి, (రాజధాని వార్తలు):** వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ వెన్నుపోటు రాజకీయాలకు ప్రతిరూపమని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. అలాంటి జగన్.. వెన్నుపోటుపై వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బుధవారం రాజధాని అమరావతిలో ఆయన మాట్లాడుతూ.. ఇతరులకు నీతులు చెప్పే ముందు రాజకీయ చరిత్ర చూసుకోవాలంటూ జగన్‌కు చురకలంటించారు. జూనియర్ డాక్టర్ల స్టైపెండ్ వ్యవహారంలో వైఎస్ జగన్ వైఖరిపై మంత్రి మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్లపై ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ వైసీపీ అధినేతపై మంత్రి సత్యకుమార్ యాదవ్ నిప్పులు చెరిగారు. రిజర్వేషన్లు ప్రకటించడం కాదు.. చట్టబద్ధంగా నిలబెట్టడమే ముఖ్యమని అభిప్రాయపడ్డారు. జగన్ హయాంలో బీసీ రిజర్వేషన్లు న్యాయపరమైన చిక్కుల్లో పడ్డాయని అన్నారు. కూటమి ప్రభుత్వం బీసీలకు చట్టబద్ధమైన సామాజిక న్యాయం చేస్తోందని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. బీసీలను ఓటు బ్యాంకుగా చూసింది జగన్ ప్రభుత్వమేనని మంత్రి సత్యకుమార్ యాదవ్ గుర్తు చేశారు. బీసీలను పాలనలో భాగస్వాములుగా చేస్తుంది కూటమి ప్రభుత్వమని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల ఓటమిపై జగన్‌లో ఇప్పుడే ఆందోళన మొదలైందంటూ ఎద్దేవా చేశారు. ఓటమికి కారణాలు వెతికే పనిలో జగన్ ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. కూటమి హయాంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిష్పక్షపాతంగా జరుగుతాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ప్రజల మద్దతు కూటమి ప్రభుత్వానికే ఉందని జగన్ ఆందోళనతో మరోసారి తేలిపోయిందని మంత్రి వివరించారు.

## హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను రేవంత్ ప్రభుత్వం దెబ్బతీసింది : హరీశ్‌రావు



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** కేసీఆర్ పాలన ప్రజల కేంద్రంగా సాగితే.. రేవంత్ పాలన భూముల కేంద్రంగా నడుస్తోందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను రేవంత్ ప్రభుత్వం దెబ్బతీసిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో 22ఏ బాధితులతో హరీశ్‌రావు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు.. ఎక్కడ భూమి కనిపిస్తే అక్కడ అమ్మేస్తున్నారని ధ్వజమెత్తారు.

**భావి తరాలకు జాగా లేకుండా చేస్తున్నారు..**

ప్రభుత్వ భూములన్నీ అమ్ముకుంటూ.. భావితరాలకు జాగా లేకుండా చేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రజల ఆస్తులనేమో 22–ఏ నిషేధిత జాబితాలోకి.. ప్రభుత్వ భూములనేమో రేవంత్ సోదరుల చేతుల్లోకి నెడుతున్నారని ఆక్షేపించారు. లక్షల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కొని పారిశ్రామికవేత్తలకు కమీషన్లకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఎప్పుడు హైడ్రా వస్తుందో.. ఎప్పుడు 22–ఏ కింద భూమి లాక్కుంటారోనని ప్రజలు భయపడుతున్నారని అన్నారు.

**అసెంబ్లీ సమావేశాల్లో 22-ఏ అంశంపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం..**

రాష్ట్రవ్యాప్తంగా కోటి ఎకరాలను, హైదరాబాద్‌లోనే లక్షలాది ఆస్తులను రేవంత్ ప్రభుత్వం 22–ఏలో చేర్చిందని హరీశ్‌రావు మండిపడ్డారు. ఈ ప్రభుత్వం చేసిన తప్పుకు ప్రజలను ఆఫీసుల చుట్టూ తిప్పుతూ 30 శాతం కమీషన్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో 22–ఏ అంశంపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు. బ్రోకర్లకు ఎవరూ ఒక్క రూపాయి ఇవ్వొద్దని.. ప్రజల ఆస్తులను కాపాడే బాధ్యత బీఆర్ఎస్‌దేనని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## యువకుడి ఆత్మహత్య.. ప్రియురాలు మోసం చేసిందంటూ సెల్ఫీ వీడియో



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లాలో యువకుడి ఆత్మహత్య కలకలం రేపుతోంది. ప్రియురాలు మోసం చేసిందంటూ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ప్రియురాలి మోసం గురించి సెల్ఫీ వీడియోలో తెలిపి సామాజిక మాధ్యమంలో పోస్టు చేసి..ఆపై ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జిల్లాలోని వెంకటాచల మండలానికి చెందిన శివకుమార్ (22), ఓ యువతి మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. అయితే ఇటీవల సదరు యువతి.. శివకుమార్‌ను మోసం చేసి మరో వ్యక్తితో ప్రేమ వ్యవహారం నడపడమే కాకుండా.. అతడితో వెళ్లిపోయింది. విషయం తెలిసిన శివ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ప్రేమించిన యువతి మోసం చేసిందంటూ గత రాత్రి సెల్ఫీ వీడియో తీసుకుని ఆపై ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తనకు న్యాయం చేయాలని శివకుమార్ సెల్ఫీ వీడియోలో కోరాడు. కొడుకు మరణంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. యువకుడి బలవన్మరణానికి కారణ మైన యువతిపై కేసు నమోదు చేయాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. నెల్లూరు జీజీహెచ్ వద్ద శివకుమార్ తల్లిదండ్రులు, బంధువులు, మిత్రులు ధర్నాకు దిగారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అమరావతి అసెంబ్లీకి సరికొత్త డిజైన్ : మంత్రి మనోహర్



**అమరావతి, (రాజధాని వార్తలు):** ప్రపంచంలోనే అద్భుతమైన రాజధానిగా అమరావతిని నిర్మించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రాజధాని నిర్మాణంలో భాగంగా అసెంబ్లీ భవనాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రూపొందిస్తున్నామని చెప్పారు. అసెంబ్లీ భవనం పైభాగంలో టవర్ ఏర్పాటు చేసి.. అక్కడి నుంచి మొత్తం రాజధాని ప్రాంతాన్ని వీక్షించేలా నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. భవిష్యత్‌లో జరిగే నియోజక వర్గాల డీలిమిటేషన్‌ను దృష్టిలో ఉంచుకుని అసెంబ్లీ భవన డిజైన్లపై చర్చించినట్లు మంత్రి తెలిపారు. 265 అసెంబ్లీ స్థానాలు, 110 శాసనమండలి స్థానాలకు అనుగుణంగా భవన నిర్మాణ డిజైన్‌ను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.

**సందర్శకులకు ప్రత్యేక అనుభూతి**

అసెంబ్లీని సందర్శించే ప్రజలకు మంచి అనుభూతి కలిగేలా ప్రత్యేకంగా ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. గవర్నర్ ప్రసంగించే సమయంలో అసెంబ్లీ, శాసనమండలి సభ్యులు ఒకే చోట కూర్చునేలా సెంట్రల్ హాల్ ఏర్పాటు చేయడానికి అనువుగా డిజైన్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. అసెంబ్లీ ప్రాంగణం చుట్టూ పచ్చదనం ఉండేలా, ఒక గార్డెన్‌లా కనిపించే విధంగా అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబు సూచించినట్లు మంత్రి తెలిపారు. మంత్రులు, విప్‌లు, కమిటీ చైర్మన్లు, శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అసెంబ్లీ డిజైన్‌ను రూపొందిస్తున్నట్లు మంత్రి మనోహర్ తెలిపారు.

# ఎయిమ్స్ మంగళగిరి ప్రొఫెసర్ డా.టి.అరుణ్ బాబుకి ప్రతిష్టాత్మక జాతీయ ఉపాధ్యాయ పురస్కారం - 2026కు ఎంపిక



**మంగళగిరి, (రాజధాని వార్తలు):** వైద్య విద్య, పరిశోధన, ఆవిష్కరణ మరియు విద్యా నాయకత్వానికి ఆయన చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా, ఎయిమ్స్ మంగళగిరిలోని పీడియాట్రిక్స్ విభాగం ప్రొఫెసర్ మరియు విభాగాధిపతి అయిన డా. అరుణ్ బాబుకి ప్రతిష్టాత్మక జాతీయ ఉపాధ్యాయ పురస్కారం 2026కు ఎంపిక య్యారు. జిప్మెర్ పూర్వ విద్యార్థి అయిన డా.అరుణ్ బాబుకి వైద్య విద్యారంగంలో దాదాపు రెండు దశాబ్దాల అనుభవం ఉంది. ఆయన అండర్ గ్రాడ్యుయేట్ మరియు పోస్ట్ గ్రాడ్యుయేట్ బోధన, పాఠ్యప్రణాళిక అభివృద్ధి మరియు అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమాలకు గణనీయమైన కృషి చేశారు. పరిశోధన మరియు శిక్షణ ద్వారా పీడియాట్రిక్ పాయింట్-ఆఫ్-కేర్ అల్ట్రాసౌండ్ అభివృద్ధికి కూడా ఆయన తోడ్పడ్డారు. ఆయన విద్యా కృషి, నూతన బోధనా పద్ధతులు, పాఠ్యపుస్తకాలు, డిజిటల్ లెర్నింగ్ వనరులు, క్లినికల్ సాధనాలు మరియు సిమ్యులేషన్ ఆధారిత బోధన ద్వారా వైద్య విద్యలో ఆవిష్కరణల పట్ల ఆయనకున్న బలమైన నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. ఆయన పరిశోధనలో ఎంతో మంది అండర్ గ్రాడ్యుయేట్ మరియు పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించి, పరిశోధన మరియు ఆవిష్కరణల సంస్కృతిని పెంపొందించడానికి దోహదపడ్డారు. 400కు పైగా శాస్త్రీయ ప్రచురణలు మరియు అనేక పరిశోధన ప్రాజెక్టులు ఆయన ఖాతాలో ఉన్నాయి. ఆయన కృషి నిరంతర విద్యా నైపుణ్యాన్ని, వైద్య విద్య మరియు రోగి-కేంద్రీకృత శిశు సంరక్షణను అభివృద్ధి చేయాలనే నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. ఈ గౌరవానికి ఎంపికైనందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, డాక్టర్ అరుణ్ బాబు ఇలా అన్నారు. "జాతీయ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకోవడం నాకు ఎంతో గౌరవంగా మరియు వినమ్రంగా అనిపిస్తోంది. ఈ గుర్తింపు నా ఉపాధ్యాయులు మరియు మార్గదర్శకులు, సహోద్యోగులు, విద్యార్థులు, రోగులు, నా సంస్థ మరియు నా కుటుంబం అందించిన మద్దతుకు ప్రతిబింబం. ఇది వైద్య విద్యకు నిరంతరం తోడ్పడటానికి, యువ మేధస్సులను పోషించడానికి మరియు తదుపరి తరం వైద్యులకు స్ఫూర్తినివ్వడానికి నాలో ఒక నూతన బాధ్యతను కూడా పెంచుతుంది.". బోధన యొక్క శాశ్వత ప్రభావాన్ని ఆయన మరింత నొక్కిచెబుతూ, "ఒక ఉపాధ్యాయుడు ఒక విద్యార్థిని ప్రభావితం చేయవచ్చు, కానీ ఆ విద్యార్థి తన సొంత పని ద్వారా వేలాది మంది జీవితాలను స్పృశించగలడు. మన గొప్ప వారసత్వం కేవలం మనం బోధించేది మాత్రమే కాదు, మనం స్ఫూర్తినిచ్చే వ్యక్తులు మరియు వారు తీసుకు వచ్చే మార్పు కూడా" అని పేర్కొన్నారు. 2026 జాతీయ ఉపాధ్యాయ పురస్కారాన్ని గౌరవనీయ భారత రాష్ట్రపతి గారు 2026 సెప్టెంబర్ 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో డాక్టర్ అరుణ్ బాబుకి ప్రదానం చేయనున్నారు. ఈ ప్రతిష్టాత్మక జాతీయ గుర్తింపు పొందినందుకు డాక్టర్ అరుణ్ బాబుకి ఎయిమ్స్ మంగళగిరి అభినందనలు తెలియజేస్తోంది. అలాగే వైద్య విద్య, పరిశోధన, ఆవిష్కరణ మరియు శిశు ఆరోగ్య సంరక్షణ రంగాలలో శ్రేష్ఠత కోసం ఆయన చేస్తున్న నిరంతర కృషిని కూడా ప్రశంసిస్తోంది.

# నందిగామలో ఘనంగా మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు

## - జామ (పెద్ద) మస్జిద్ నుండి పట్టణ పురవీధుల్లో భారీ ర్యాలీ
## - భారీగా సంఖ్యలో పాల్గొన్న ముస్లిం మైనార్టీ సోదరులు
## - మస్జిద్‌లో 6000 మందికి ఆత్మీయ విందు



**నందిగామ, (రాజధాని వార్తలు):** నందిగామ పట్టణం జామా (పెద్ద) మస్జిద్ ముతవల్లి మరియు జమాత్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రవక్త జన్మదిన వేడుకలు నిర్వహించారు.ముస్లింలకు అత్యంత అత్యంత ప్రీతి పాత్ర మైన ముఖ్యమైన పండగ మహమ్మద్ ప్రవక్త జన్మదినం అయిన ఈద్ మిలా ఉన్ నబీ. ఈసందర్భంగా నందిగామ పట్టణ పురవీధుల్లో జెండాలు చేత పట్టి, ప్రవక్తను స్మరిస్తూ, ఆయన బోధనలను, కీర్తనలను ఆలపిస్తూ అత్యంత భక్తి శ్రద్ధలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఫారుక్ షిబ్లి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు, సూఫీ మత గురువులు,ముస్లిం పర్సనల్ లా బోర్డు రాష్ట్ర అధ్యక్షులు అల్తాఫ్ బాబా పాల్గొన్నారు. ముందుగా ఛత్తీస్ ఘడ్ నుంచి వచ్చిన ముఖ్య అతిథిగా వచ్చిన ప్రముఖ మత గురువు అల్తాఫ్ రజా ధమతరి ప్రపంచ శాంతి కోసం సర్వమానవళి శ్రేయస్సు కోసం ప్రార్థన చేసి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫారుక్ షుబ్లిగారు మాట్లాడుతూ దివ్య ఖురాన్‌లోని సూరా అల్-మాయిదా వాక్యంలోని పవిత్రమైన అయత్ అను ఈ సందర్భంగా ప్రస్తావించారు.ఒక మానవుని ప్రాణాన్ని కాపాడటం అనేది సర్వ మానవాళి ప్రాణాలను కాపాడటంతో సమానమని, అలాగే కారణం లేకుండా ఒకరి ప్రాణాన్ని తీయడం సర్వ మానవాళిని అంతం చేయడంతో సమానమని స్పష్టం చేశారు. అందరికీ ఈద్ మిలాద్-ఉన్-నబి శుభాకాంక్షలు తెలిపారు. సూఫీ మత గురువులు అల్తాఫ్ బాబా మాట్లాడుతూ పండుగ సందర్భంగా ప్రతి ఒక్కరూ అన్నదానాలు, సేవా కార్యక్రమాలు చేయాలని విజ్ఞప్తి చేశారు. పండగ సందర్భంగా ఆర్భాటాలకు వెళ్లకుండా సమాజానికి ఉపయోగపడాలని అన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు మాట్లాడుతూ "మహమ్మద్ ప్రవక్త జీవితం మానవాళికి ప్రేమ, సౌభ్రాతృత్వం, ధర్మానికి స్ఫూర్తిదాయక ప్రతీక అని, తోటి ప్రజలకు విశ్వాసం, నమ్మకం, శ్రద్ధ, కరుణతో సేవ చేసినప్పుడే ప్రవక్త ఆశయాలు నెరవేరుతాయని, ప్రవక్త దయ, కరుణ, బోధనలను ఈ పవిత్ర మైన రోజు మనకు గుర్తు చేస్తుందని తెలిపారు. ముస్లిం సోదరులకు హృదయపూర్వక మిలాద్ ఉన్ నబి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ పవిత్ర రోజు మనందరిలో శాంతి, సద్భావన, సోదర భావాన్ని పెంపొందించాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం మగవారికి పెద్ద మస్జిద్‌లో మరియు ఆడవారికి మదర్సా నందు సుమారు 6000 మందికి భారీ ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మస్జిద్ ముత్తవలి మహమ్మద్ ఖాజా మొహిద్దిన్, మస్జిద్ మత గురువు సాదిక్ రాజా,అనేక మస్జిద్‌ల ముతవల్లిలు, ప్రెసిడెంట్లులు, ముస్లిం మత పెద్దలు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ముస్లిం మైనార్టీ విభాగం నాయకులు, ముస్లిం సోదరులు, ప్రజలు భారీగా పాల్గొన్నారు.

# జగన్ మాట్లాడుతుంటే.. దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది: దేవినేని ఉమా



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఐదేళ్ల అరాచకాల పాలన మరిచి పోయి నేడు వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ఏకగ్రీవాల గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమా తెలిపారు. జగన్ రాజకీయ భవిష్యత్తుకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే సమాధానం చెబుతారని చెప్పారు. బుధవారం రాజధాని అమరావతిలో ఆయన మాట్లాడుతూ.. మూడు దశాబ్దాల సీఎం చంద్రబాబు కష్టానికి ప్రతిఫలమే వెలుగొండ ప్రాజెక్ట్ అని గుర్తు చేశారు. పదవులు శాశ్వతం కాదు జగన్.. చేసిన అభివృద్ధే శాశ్వతమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి బాధ్యతను మరిచి ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడటం దుర్మార్గమని అన్నారు. ఐదేళ్లలో జగన్ రెడ్డి చేసిన అరాచకాలపై ప్రచురించిన పుస్తకాలను ఒక్కసారి చదువుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 48 ఏళ్ల అనుభవాలను ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆదర్శంగా తీసుకొంటున్నారని పేర్కొన్నారు. నీవు చేసే పిల్ల చేష్టలు ప్రజలు చూస్తున్నారని చెప్పారు. పులివెందులకు నీళ్లు ఎవరిచ్చారో.. ఎలా వచ్చాయో రైతులు, ప్రజలను అడిగితే చెప్తారన్నారు. జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో ఇరిగేషన్, వ్యవసాయ రంగాలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్ల పాలనలో బీసీలపై చేసిన అరాచకాలను మరిచిపోయి నేడు కపట ప్రేమ చూపిస్తూ శ్రీరంగనీతులు చెప్పడం జగన్‌కే చెల్లిందంటూ మండిపడ్డారు. పారదర్శకంగా జరిగిన డీఎస్సీపై విషం చిమ్మాలని జగన్ చేసిన కుట్రలను ఉపాధ్యాయులు తిప్పికొట్టారని వివరించారు. శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల నుంచి చుక్క నీరు రాకపోయినా కృష్ణా డెల్టాను కాపాడుకున్నామంటే అది చంద్రబాబు దార్శనికతకు నిదర్శనమన్నారు. పట్టిసీమ నుంచి ప్రకాశం బ్యారేజీకి వచ్చిన 30 టీఎంసీల నీరు చూసైనా జగన్‌లో మార్పు వస్తుందని అనుకుంటే.. ఒక్క మంచి మాట కూడా మాట్లాడలేకపోయారని తెలిపారు. వెలిగొండ, తోటపల్లి సహా రాష్ట్రంలోని అనేక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయడంతో పాటు వాటిని పూర్తి చేసిన ఘనత చంద్రబాబుదేనని చెప్పారు. నేడు నిర్వాసితుల గురించి మాట్లాడుతున్న జగన్.. నాడు ప్రాజెక్టును జాతికి ఎలా అంకితం చేశారో గుర్తు చేసుకోవాలని అన్నారు. పోలవరం ప్రాజెక్టును ఐదేళ్లపాటు నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు పూర్తయి ఉంటే ఈ పాటికి లక్షలాది ఎకరాలు సస్యశ్యామలమయ్యేవని పేర్కొన్నారు. తీవ్ర కరువు పరిస్థితుల్లోనూ సమన్వయంతో కూటమి ప్రభుత్వం అన్ని ప్రాంతాలను కాపాడుకుంటుంటే.. అసలు నీళ్లే రావంటూ జగన్ శాపనార్థాలు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్‌కు నీళ్ల పట్ల శ్రద్ధ లేదు.. పంచభూతాలపై గౌరవం లేదని చెప్పారు.

# మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ముస్లిం యువకుల రక్తదానం

## - ఆషికానే రసూల్ టీమ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం - రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫారుక్ సుబ్లి, అల్తాఫ్ బాబా

**కొండపల్లి, (రాజధాని వార్తలు):** ముస్లింలకు అత్యంత ముఖ్యమైన పండగ మహమ్మద్ ప్రవక్త జన్మదిన ఈద్ మిలా ఉన్ నబీ సందర్భంగా కొండపల్లి ముస్లిం యువకులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఆషికానే రసూల్ టీమ్ ఆధ్వర్యంలో కొండపల్లి బ్యాక్ సెంటర్ లోని సరాయి ఖానా లో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫారుక్ సుబ్లి, సూఫీ మత గురువులు అల్తాఫ్ బాబా ప్రారంభించారు. ఫారుక్ షుబ్లి మాట్లాడుతూ దివ్య ఖురాన్‌లోని సూరా అల్-మాయిదా (5:32) వాక్యంలోని పవిత్రమైన సూత్రాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఒక మానవుని ప్రాణాన్ని కాపాడటం అనేది సర్వ మానవాళి ప్రాణాలను కాపాడటంతో సమానమని, అలాగే కారణం లేకుండా ఒకరి ప్రాణాన్ని తీయడం సర్వ మానవాళిని అంతం చేయడంతో సమానమని స్పష్టం చేశారు.అందరికీ ఈద్ మిలాద్-ఉన్-నబి శుభాకాంక్షలు తెలిపారు. సూఫీ మత గురువులు అల్తాఫ్ బాబా మాట్లాడుతూ ఆషికానే రసూల్ టీమ్ ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ అన్నదానాలు, సేవా కార్యక్రమాలు చేయాలని విజ్ఞప్తి చేశారు. పండగ సందర్భంగా ఆర్భాటాలకు వెళ్లకుండా సమాజానికి ఉపయోగపడే ఒక మంచి సేవా కార్యక్రమం చేయడం ఎంతో అభినందనీయమని ముస్లిం యువకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం యువకులు స్థానిక ముస్లిం సోదరులు పాల్గొన్నారు.




# క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన శిశు మందిరం విద్యార్థులు



**గూడూరు, (రాజధాని వార్తలు):** అనంతపురం జిల్లా పామిడిలో విద్యాభారతి-ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో గూడూరు శ్రీ సరస్వతి శిశు మందిరం విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. అథ్లెటిక్స్ విభాగంలో బాలురు, బాలికలు కలిసి రెండు ప్రథమ, ఒక తృతీయ బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, వన్‌టౌన్ ఎస్ఐ శిరీష విజేతలను అభినందించారు. క్రీడలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని చంద్రశేఖర్ తెలిపారు. సెప్టెంబర్ 6న హైదరాబాద్‌లో జరిగే తదుపరి పోటీల్లోనూ విజయం సాధించాలని ఎస్ఐ శిరీష ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి మయూరి శ్యామ్ యాదవ్, వాకాటి రామ్మోహన్, ప్రధానాచార్యులు రంగ నాయకులు, సహ ప్రధానాచార్యులు రోహిణి, ఏఎస్ఐ బాబురావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పెద్దలు శాంతారామ్ జె పవార్ సేవలు చిరస్మరణీయం

## - కాటంరెడ్డి పవిత్ర రెడ్డి బియ్యపు

**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తి దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్, మాజీ పురపాలక సంఘ చైర్మన్ స్వర్గీయ శాంతారామ్ జె పవార్ సేవలను ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరని, ఆయన సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె కాటంరెడ్డి పవిత్ర రెడ్డి బియ్యపు కొనియాడారు.

శాంతారామ్ జె పవార్ జయంతి సందర్భంగా ఆయన నివాసం వద్ద ఉన్న విగ్రహానికి వారి కుటుంబ సభ్యులు జనార్ధన్‌రావు జె పవార్, కుమార్తె డాక్టర్ అర్చనలతో కలిసి పవిత్ర రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాంతారామ్ జె పవార్ శ్రీకాళహస్తి దేవస్థానం పాలక మండలి చైర్మన్‌గా, పురపాలక సంఘ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ పట్టణాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి విశేష సేవలు అందించారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, రత్నం రెడ్డి, నియోజకవర్గ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ పఠాన్ ఫరీద్, కోవి చంద్రయ్య నాయుడు, మాజీ దేవస్థానం బోర్డు మెంబర్ మున్నా రాయల్, యువజన విభాగ అధ్యక్షులు సూర సురేష్, ఉత్తరాజి శరవణ కుమార్, పెరు మాళ్ చౌదరి, ఫజల్, జుంలేష, మెహబూబ్ బాషా, జీలాని, బావాజీ, అస్లాం, గౌస్ బాషా, గిరి రెడ్డి, బుగ్గ హరి, కాపులూరి వెంకీ, శ్రీరాములు రెడ్డి, రవి నలుగురి, షరీఫ్, ఖాదర్ బాషా, విజయ్ కుమార్ రెడ్డి, ఆరీఫ్, బాబు, ఉస్మాన్, మస్తాన్, రియాజ్, సాదిక్, గిరి, యాకుబ్, దివ్య కాంత్ తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనల మేరకు ఉచిత ఇసుకను సద్వినియోగం చేసుకోవాలి

**- కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి - నిర్మాణ రంగానికి, కార్మికులకు ప్రయోజనం కలిగేలా ఉచిత ఇసుక విధానం - ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ట్రాక్టర్లు, కూలీల సాయంతో ఇసుక తరలింపు - ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలి - 27 నుంచి బుచ్చిరెడ్డిపాళెం శాంతినగర్‌లో 'వీపీఆర్ నేత్ర' సేవలు - ఇప్పటి వరకు జిల్లాలో లక్షకు పైగా ఉచిత కంటి పరీక్షలు - 65 వేలకు పైగా కళ్లజోళ్ల పంపిణీ**



**కోవూరు, (రాజధాని వార్తలు):** నిర్మాణ రంగానికి, భవన నిర్మాణ కార్మి కులకు, రోజువారీ కూలీలకు ప్రయోజనం కలిగేలా ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోవూరు శాసనసభ్యులు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సూచించారు. మంగళవారం బుచ్చిరెడ్డిపాళెంలో మీడియాతో మాట్లాడుతూ, ఇసుక సమస్యను భవన నిర్మాణ కార్మికులు, రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్నవారు, రోజువారీ కూలీలు ఇప్పటికే తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న ఈ సమస్యపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించి, నిబంధనలకు లోబడి ఉచితంగా ఇసుక తీసుకెళ్లే అవకాశం కల్పించారని చెప్పారు. ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండేలా ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వినియోగించుకోవాలని ఎమ్మెల్యే గారు కోరారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మాత్రమే ఇసుకను తరలించుకోవాలని, ఇందుకు ట్రాక్టర్లు, కూలీల సాయాన్ని మాత్రమే వినియోగించాలని సూచించారు. జేసీబీలు, టిప్పర్లు వినియోగించకూడదని, రాత్రి వేళల్లో ఇసుక తవ్వకాలు జరపకూడదని స్పష్టం చేశారు.

**నిబంధనలు పాటిస్తే అందరికీ ప్రయోజనం**

కోవూరు నియోజకవర్గంలో ఉచిత ఇసుక విధానం సజావుగా అమలయ్యేలా ప్రతి ఒక్కరూ ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలను పాటించాలని ఎమ్మెల్యే కోరారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై పోలీసులు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారని తెలిపారు. అవసరమైతే సంబంధిత వ్యక్తులను అరెస్టు చేయడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తారని చెప్పారు. ఉచిత ఇసుక విధానం వల్ల కార్మికులకు, నిర్మాణ రంగానికి మేలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

**27 నుంచి బుచ్చిరెడ్డిపాళెంలో 'వీపీఆర్ నేత్ర'**

పేదల కంటి చూపును రక్షించి, వారి జీవితాల్లో వెలుగులు నింపాలనే లక్ష్యంతో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రారంభించిన 'వీపీఆర్ నేత్ర' సేవలు ఈ నెల 27వ తేదీ నుంచి బుచ్చిరెడ్డిపాళెం శాంతినగర్‌లో ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే తెలిపారు. కోవూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఇప్పటికే 'వీపీఆర్ నేత్ర' సేవలు పూర్తయ్యాయని, 27వ తేదీ నుంచి బుచ్చిరెడ్డిపాళెం మండలంలోనూ ఈ సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. పార్టీలకు అతీతంగా ప్రజలందరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకుని ఉచిత కంటి పరీక్షలు చేయించుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. కంటి పరీక్షల అనంతరం అవసరమైన వారికి అక్కడికక్కడే 'వీపీఆర్ నేత్ర' సిబ్బంది ఉచితంగా కళ్లజోళ్లు అందజేస్తారని తెలిపారు. ఇప్పటి వరకు నెల్లూరు జిల్లాలో లక్షకు పైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించామని, 65 వేలకు పైగా కళ్లజోళ్లు అందజేశామని ఎమ్మెల్యే వివరించారు. పేదల కంటి చూపును కాపాడే ఈ సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఘనంగా కీ.శే. శాంతారామ్ రావు జె.పవార్ జయంతి వేడుకలు



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తి పట్టణంలోని 'ది స్కూల్' ఆవరణలో జనార్ధన్ పవార్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు, మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కీ.శే.శాంతారామ్‌రావు జె.పవార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీకాళహ స్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు హాజరై, శాంతారామ్ రావు జె.పవార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందరివాడు శాంతారామ్ కులం, మతం, వర్గం, వర్ణంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా చేరదీసే వ్యక్తిత్వం శాంతారామ్ ది అన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ఆయన అందరివాడుగా నిలిచారని, ఆయన భౌతికంగా మనకు దూరమవ్వడం తీరని లోటని పేర్కొన్నారు. ఆశయాల సాధన శాంతారామ్ ఆశయాలకు అనుగుణంగానే జనార్ధన్ పవార్ ది స్కూల్‌ను విజయవంతంగా నడుపుతున్నారని, ప్రస్తుతం ఈ పాఠశాలలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగిందని కొనియాడారు. ఆయన జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన పాఠశాల, చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవలను ముందుకు తీసుకెళ్లడం అభినందనీయమన్నారు. మచ్చ లేని నాయకత్వం శ్రీకాళ హస్తి దేవస్థానం చైర్మన్‌గా, మున్సిపల్ చైర్మన్‌గా ఎక్కడా అవినీతి మరక పడకుండా పాలన సాగించిన ఘనత శాంతారామ్‌దేనని కొనియాడారు. తమకు దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా అవకాశం వచ్చినప్పుడు ఆయన మార్గదర్శకత్వాన్ని స్మరించుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా చేపట్టినట్లు తెలిపారు. శాంతారామ్ రావు పవిత్రాత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, ఆయన కుటుంబ సభ్యులైన డాక్టర్ అర్చనకు, సోదరులకు జ్ఞానప్ర సూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో రత్నం రెడ్డి, శ్రీవారి సురేష్, కంటా ఉదయ్ కుమార్, పటాన్ ఫరీద్, ఆర్కాడ్ శంకర్, గిరి గౌడ్, జూమ్లేష, బావాజీ, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్ణీత చార్జీలు వసూలు చేయాలి

**- క్యాబ్ డ్రైవర్లకు డిటిఓ మురళీమోహన్ సూచన**



**తిరుపతి, (రాజధాని వార్తలు):** శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని వచ్చే భక్తులకు ఇబ్బందులు కలిగించకుండా క్యాబ్ టాక్సీ డ్రైవర్లు నిర్ణిత చార్జీలను వసూలు చేయాలని జిల్లా రవాణా శాఖ అధికారి కే మురళి మోహన్ సూచించారు. మంగళవారం శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో డ్రైవర్లకు మార్గదర్శకాలు శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు సురక్షితమైన, సౌకర్యవం తమైన రవాణా సేవలు అందించేందుకు జీపులు, సుమోలు, టాక్సీ డ్రైవర్లు, స్టాండ్‌ల అసోసియేషన్ ప్రతినిధులతో పోలీసు, రవాణా శాఖల ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్, ట్రాఫిక్ డీఎస్పీ కొండయ్య మాట్లాడుతూ డ్రైవర్లు నిర్ణీత చార్జీలే వసూలు చేయాలని, అధిక ప్రయాణికులను ఎక్కిం చుకోవద్దని, అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్, సెల్‌ఫోన్ వినియోగం వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. వాహనాల ఫిట్‌నెస్, పర్మిట్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలు సక్రమంగా ఉండాలని, ట్రాఫిక్ పోలీసులు సూచించే మార్గాలు, పార్కింగ్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. బ్రహ్మోత్సవాల సమయంలో భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్య తనిస్తూ పోలీసు, రవాణా శాఖలకు డ్రైవర్లు సహకరించాలని అధికారులు సూచించారు.

# స్థానిక సంస్థల ఎన్నికల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**- మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి**









**తాడేపల్లి, (రాజధాని వార్తలు):** తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నియోజకవర్గ ఇన్చార్జిలతో నిర్వహించిన సమా వేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్చార్జిలకు పార్టీ బలోపేతం.. స్థానిక సంస్థల ఎన్నికలపై జగన్మోహన్ రెడ్డి పలు సూచనలు చేశారు. పార్టీలో అన్ని వర్గాలను సమన్వయపరచుకుంటూ స్థానిక సంస్థల ఎన్నికల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల వెన్నుపోటు పాలన మరియు అక్రమాలను ప్రతి గడపకు చేరవేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కడైనా అధికార పార్టీ దౌర్జన్యాలు, దాడులకు, తెగబడితే పార్టీ లీగల్ సేల్, ఐటి సెల్‌ను ఉపయోగించుకొంటూ సంఘటితంగా ఎదుర్కోవాలని దిశానిర్దేశం చేశారు.

# జెన్-జీ యువత ఆకాంక్షలకు అనుగుణంగా ఓ శాసనసభ్యుడిగా పని చేస్తా

**- 51 రోజులపాటు 51 చోట్ల జెన్-జీ యువతతో ఆత్మీయ భేటీ - దాదాపుగా 20 వేల మంది విద్యార్థులతో నేరుగా భేటీ - దాదాపుగా 4 గంటల పాటు జెనెక్స్ కాలేజీలో 1000 మందితో సాగిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి భేటీ**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని పార్థసారథి నగర్‌లో జెనెక్స్ కాలేజ్ విద్యార్థిని విద్యార్థులతో ఆత్మీయ భేటీ కార్యక్రమంలో పాల్గొన్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. జెనెక్స్ కాలేజ్ విద్యార్థిని విద్యార్థులతో 4 గంటల పాటు సాగిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆత్మీయ భేటీ. వ్యవస్థలను విధ్వంసం చేసే ముఖ్యమంత్రి మాకు వద్దు. విజన్ ఉన్న నారా చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్, నారా లోకేష్‌లాంటి నాయకత్వం మాకు కావాలి అంటున్న యువత. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. జెన్ -జీ యువత ప్రశ్నించడం ఉద్యమించడం సమాజానికి ఎంతో అవసరం.

ప్రశ్నించేటప్పుడు సంప్రదాయ భాషలో నలుగురు మెచ్చేలా మన భాష ఉండాలి. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. జెన్-జీ యువత ఆకాంక్షలు, మనోభావాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరియు నారా లోకేష్‌ల దృష్టికి తీసుకుపోతా. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. జెన్-జీ యువత ఆకాంక్షలకు అనుగుణంగా నెల్లూరు రూరల్‌లో స్థానిక శాసన సభ్యుడుగా పనిచేస్తా. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి.

# శ్రీకాళహస్తి చిత్రపటంలో శాంతారాంకు ప్రత్యేక స్థానం

**- ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి**



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** కులమతాలకు అతీతంగా, వర్ణ భేదం లేకుండా, వర్గ వైషమ్యాలకు తావు లేకుండా శ్రీకాళహస్తి పుర ప్రజల సేవలో తరించిన స్వర్గీయ శాంతారాం జె పవార్‌కి శ్రీకాళహస్తి చిత్ర పటంలో ప్రత్యేక స్థానం ఉంటుందని శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి స్మరించుకున్నారు. శ్రీకాళహస్తి పుర ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించి, శ్రీకాళహస్తి పట్టణాభివృద్ధిలో తమకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్న పవార్ కుటుంబ వారసుడు, శాంత మూర్తి, అజాత శత్రువుగా కీర్తిని గడించిన శ్రీకాళహస్తి పురపాలక సంఘం మాజీ ఛైర్మన్, శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మన్ స్వర్గీయ శాంతారాం జె పవార్ జయంతిని పురస్కరించుకొని ఈరోజు వారికి ఘనంగా నివాళులు అర్పించారు. పవార్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ది స్కూల్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన శాంతారాం విగ్రహానికి పవార్ కుటుంబ సభ్యులు నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని, వారి విగ్రహానికి పూలమాలలు అలంకరించి, కొబ్బరి కాయలు కొట్టి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఎనిమిది దశాబ్దాల శ్రీకాళహస్తి రాజకీయ చరిత్ర కలిగిన పవార్ కుటుంబం శ్రీకాళహస్తి పట్టణాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించారని, అలాగే విద్య, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. రాజకీయాలకు అతీతంగా పవార్ కుటుంబం, బొజ్జల కుటుంబం శ్రీకాళహస్తి పట్టణ అభివృద్ధికి సమన్వయంతో పని చేయడం గర్వించదగిన విషయం అని, అలాగే శాంతారాం చివరి శ్వాస వరకు శ్రీకాళహస్తి పట్టణ శ్రేయస్సు కోసం నిరంతరం పరితపిస్తూ ఉండేవారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పవార్ కుటుంబ సభ్యులు పరమేశ్వర రావు వి పవార్, ముకుంద రావు జె పవార్, జనార్ధన్‌రావు జె పవార్, రాజారాం రావు వి పవార్, శివశంకర్ రావు వి పవార్, హేమంత్‌రావు యం గైక్వాడ్, రిటైర్డ్ హెడ్మాష్టర్ సత్యనారాయణ రావు పడోల్కర్, బాబు, మయ, దొరబాబు, ఆర్ముగం, ప్రసూన, తెలుగుదేశం పార్టీ నాయకులు డా.జి.దశరథాచారి, మిన్నల్ రవి, విజయకుమార్ నాయుడు, లక్కమనేని మధుబాబు, షేక్ మహబూబ్ బాషా, డా.యం.ఉమేష్ రావు, సుబ్బయ్య, రవీంద్ర బాబు, షేక్ బషీర్, ఖాదర్, తుపాకుల ప్రసాద్, రవీంద్ర బాబు నాయుడు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## సైద్ధాంతిక రాజకీయాలు ఏవీ?

'పాతికేళ్ల క్రితం నేను మీ నాన్నను కలుసుకునేందుకు మీ ఇంటికి స్కూటర్‌పై వచ్చాను గుర్తుందా?' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ గుజరాత్‌కు చెందిన ఒక యువనేతను ఉద్దేశించి అన్నారు. 1991లో మురళీ మనోహర్ జోషీతో పాటు ఏక్తా యాత్రకు సహాయంగా వచ్చినప్పుడు 'నీవు ఒక పిల్లవాడిగా మాకు ఫలహారాలు అందించావు' అని ఆయన మరో నేతకు చెప్పారు. '2014లో నేను ప్రధాని కాకముందు హైదరాబాద్ వచ్చినప్పుడు ఎల్బీ స్టేడియంలో యువసమ్మేళనం నీ ఆధ్వర్యంలోనే జరిగింది కదా, అప్పుడు టికెట్ పెట్టినా భారీ ఎత్తున యువత హాజరైంది' అని ఏపీకి చెందిన మరో నాయకుడితో మోదీ అన్నారు. కొత్తగా నియమితులైన బీజేపీ పదాధికారులతో దాదాపు నాలుగు గంటల పాటు మోదీ సమావేశమైనప్పుడు జరిగిన సంభాషణలివి. బీజేపీ పదాధికారులందర్నీ తన చుట్టూ కూర్చోబెట్టుకుని దాదాపు 50 మందితో మాట్లాడనిచ్చిన మోదీ.. మధ్య మధ్యలో వారితో తన అనుబంధాన్ని, గత స్మృతులను నెమరు వేసుకున్నప్పుడు వారు ఆశ్చర్యపోయారు. కొంతమంది అయితే కన్నీరు కార్చారు. 'మోదీ జ్ఞాపకశక్తి అమోఘం' అని ఒక నేత చెప్పారు. 'కొత్త టీమ్ సమావేశం జరుగుతోంది సార్. మీరు వస్తే బాగుంటుంది అని నేనే ప్రధానికి చెప్పాను' అని జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ చెప్పారు. 'కెప్టెన్ ఆదేశిస్తే రాకుండా ఎలా ఉంటాను.. మీ అందర్నీ కలుసుకుంటే ఇంట్లో కుటుంబ సభ్యుల మధ్య ఉన్నట్లుంటుంది' అని మోదీ నవ్వుతూ చెప్పారు. రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధరా రాజే, సిద్ధాంతకర్తగా పేరొందిన రాంమాధవ్, సంస్థాగత ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ తదితర ఉద్దండులు కూడా మోదీ మాట్లాడుతుంటే తదేకంగా వింటూ కూర్చున్నారు. సమావేశం తర్వాత వారందరితో పాటు గ్రూప్ ఫొటో దిగారు. కలిసి భోజనం చేశారు. ఆశ్చర్యకమైన విషయం ఏమంటే, ఈ కీలక సమావేశంలో హోంమంత్రి అమిత్ షా పాల్గొనలేదు. గతంలో జగత్‌ప్రకాశ్ నడ్డా అధ్యక్షుడు అయిన తర్వాత ఆఫీసు బేరర్లను నియమించినప్పుడు మోదీ ఇలాంటి అసాధారణమైన రీతిలో వ్యవహరించలేదు. ప్రధానమంత్రి కార్యాలయానికి వారందర్నీ పిలిపించుకుని గ్రూపుల వారీగా ఫొటోలు దిగి పంపించేశారు. ఈసారి మోదీ తానే పార్టీ కార్యాలయానికి వచ్చి పాల్గొన్న ఈ సమావేశం ద్వారా పంపించిన సందేశం ఏమిటి? అందరి పుట్టుపూర్వోత్తరాల్ని పరిశీలించిన తర్వాతే వారిని తానే ఎంపిక చేశానని, ఇది తన టీమ్ అని మోదీ అప్రకటితంగానే స్పష్టం చేశారు. ప్రభుత్వానికైనా, పార్టీకైనా తానే నాయకుడినని, తానే రెండింటినీ నడిపిస్తానని, రెండో వ్యక్తికి ఆ అవకాశం ఇవ్వనని చెప్పడం కూడా ఆయన ఉద్దేశం కావచ్చు. రానున్న రోజుల్లో వారికి బాధ్యతలు అప్పజెప్పే విషయంలో కూడా తన హస్తం ఉంటుందని ఆయన మాటల్లో పరోక్షంగా వ్యక్తం అయింది. గడచిన కొన్ని రోజులుగా దేశంలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకుని పరిస్థితిని తన పూర్తి నియంత్రణలోకి తీసుకోవాలని నరేంద్రమోదీ నిర్ణయించినట్లు స్పష్టమవుతోంది. గత కొద్ది రోజులుగా ఆయన ఒక్కో కేంద్ర మంత్రిని పిలుచుకుని సుదీర్ఘంగా మాట్లాడుతున్నారు. త్వరలో మంత్రివర్గంలో భారీ మార్పులకు కూడా ఆయన రంగం సిద్ధం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇంతకీ.. పార్టీని, ప్రభుత్వాన్ని కొత్త రీతిలో, సైద్ధాంతికంగా పటిష్ఠం చేసే దిశలో మోదీ నడిపించదలుచుకున్నారా అన్నది ప్రశ్న. సైద్ధాంతికంగా ఆయన పార్టీ పదాధికారులకు చెప్పింది ఏమీ లేదు. దేశంలో ప్రస్తుత వివాదాలపై దృష్టి సారించకుండా వికసిత్ భారత్ పైనే ఆలోచించాలని చెప్పారు. ప్రజల్లోకి వెళ్లాలని, యువతను విశ్వాసంలోకి తీసుకోవాలని, నిరాడంబరంగా వ్యవహరించాలని, సోషల్ మీడియాపై దృష్టి సారించాలని ప్రోత్సహించారు. యథాప్రకారం ఆయన తన నాయకత్వాన్నే పార్టీ ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్దేశించారు. సెప్టెంబర్ 17న తన పుట్టిన రోజు సందర్భంగా నెల రోజుల పాటు సేవా సంకల్ప్ అభియాన్ పేరుతో ఉధృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. అంతేకాదు, తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వేడుకలు జరుపుకోవాలని కూడా ఆయన నిర్ణయించారు. బీజేపీ, కేంద్ర ప్రభుత్వం వ్యక్తి కేంద్రంగా ఎందుకు మారుతున్నాయి అన్న ప్రశ్నకు జవాబిచ్చే సిద్ధాంతకర్తలెవరూ ఆ పార్టీలో లేరు. పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ మోదీ తనను తాను కథానాయకుడిగా చిత్రించి అందరిలో ఆరాధనాభావం కల్పించాలని భావిస్తున్నట్లు మాత్రం స్పష్టమవుతోంది. పదాధికారుల సమావేశంలో బీజేపీ చేసిన ప్రధాన తీర్మానం వందేమాతర గీతం గౌరవాన్ని పరిరక్షించాలని నిర్ణయం తీసుకోవడం. వందేమాతర గీతాన్ని రెండు చరణాలు మాత్రమే పాడాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీసుకున్న నిర్ణయాన్ని బీజేపీ పదాధికారుల సమావేశం తీవ్రంగా ఖండించింది. అసలు వందేమాతర గీతం పూర్తిగా పాడాలనడం దేశంలో జనాన్ని కదిలించి బీజేపీ ఆశిస్తున్న సాంస్కృతిక జాతీయవాదానికి దారి తీస్తుందా అన్నది చర్చనీయాంశం. ప్రజల్లో, ప్రధానంగా నేటి జెన్‌జీలో వందేమాతరం రెండు చరణాలకు పరిమితం కాకుండా పూర్తిగా పాడాలని చట్టం చేయడం ఎంత భావోద్వేగాన్ని కలిగిస్తుందనేది కూడా అంచనా వేయవలిసి ఉన్నది. చట్టం ద్వారా జాతీయ ఐక్యతను సాధించగలమా? అయినప్పటికీ ఇది బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య ఒక సైద్ధాంతిక వ్యత్యాసాన్ని స్పష్టం చేస్తుందనడంలో సందేహం లేదు. కానీ నిజంగా ఈ రెండు పార్టీలు ఈ సైద్ధాంతిక దృక్పథంలో లోతుగా ఆలోచించి నిజాయితీగా పనిచేస్తున్నాయా అన్నది కూడా ఆలోచించాల్సి ఉన్నది.

# కరపలో ఇంటింటికీ తెలుగుదేశం








**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్ మండల కేంద్రం కరపలో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణ మూర్తి దంపతులు పాల్గొని గ్రామంలోని ప్రతి వీధి, ఇంటిని సందర్శించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ముఖ్యంగా 'సూపర్–6' హామీల అమలు తీరుకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేసి, పథకాల ద్వారా కలుగుతున్న ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. స్థానిక ప్రజలు నాయకులకు ఘన స్వాగతం పలికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలోని పలు మౌలిక వసతులు, స్థానిక సమస్యలను ప్రజలు మాజీ ఎమ్మెల్యే దంపతుల దృష్టికి తీసుకురాగా సమస్యలను ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమాంతరంగా కొనసాగించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ జడ్పీటీసీలు నులుకుర్తి వెంకటేశ్వరరావు, బుంగా సింహాద్రి, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, టీడీపీ కాకినాడ పార్లమెంటు ఉపాధ్యక్షులు చుండ్రు వెంకన్నరాయ చౌదరి, ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవు వెంకన్న, క్లస్టర్ ఇన్‌చార్జి మద్దూరి స్వామి, జెడ్ బావారం సొసైటీ చైర్మన్ గంటా వీరన్న చౌదరి, చీపురుపల్లి జయేంద్రబాబు, గొర్రెల వెంకన్న, కాకర్ల బుజ్జిబాబు, భోగిరెడ్డి కొండబాబు, యాళ్ల పండు, పేపకాయల అంజి, పేకేటి దుర్గాప్రసాద్, చాట్రా ఇమాన్యులు, తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

# డీఎస్పీ కార్యాలయం ప్రారంభం





**అమలాపురం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన డీఎస్పీ కార్యాలయాన్ని మంగళవారం ఏలూరు రేంజ్ డీఐజీ జి.వి.జి.అశోక్‌కుమార్, శాసనసభ్యులు ఐతాబత్తుల ఆనందరావులు సంయుక్తంగా ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య పూర్ణకుంభంతో డీఐజీ అశోక్ కుమార్‌కు ఘన స్వాగతం పలికారు. డి.ఎస్.పి కార్యాలయ భవనం ప్రారంభంతో ప్రజలకు మెరుగైన శాంతి భద్రతలు అందించడానికి పోలీస్ సేవలు పరిధిని విస్తరించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే ఆనందరావు అన్నారు. నూతన డీఎస్పీ కార్యాలయం అందుబాటులోకి రావడంతో అమలాపురం సబ్ డివిజన్ పరిధిలో పోలీసు పరిపాలన, శాంతిభద్రతల పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవకాశం ఏర్పడిందని పోలీస్ అధికారులు అన్నారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిరాజు, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణ, బొమ్మి ఇజ్రాయెల్, పేరాబత్తుల రాజశేఖరం, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా,అదనపు ఎస్పీ మహేంద్ర మత్తే, అమలాపురం ఎస్‌డీపీఓ టి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణ బాబు, అల్లాడ శరత్‌బాబు, పెచ్చెట్టి చంద్రమౌళి, ఆర్డీఎస్ ప్రసాద్, కంచిపల్లి అబ్బులు, బోణం సత్య వరప్రసాద్, టౌన్ సిఐ వీరబాబు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

# ఏఈ నూకరాజు కుటుంబానికి న్యాయం చేయాలి : ఎర్రంనీడి పద్మావతి

**కాకినాడ, (రాజధాని వార్తలు):** ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్యకు దారి తీసిన ఘటనపై సమగ్ర, నిష్పక్షపాత దర్యాప్తు జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని బీజేపీ కరప మండల అధ్యక్షురాలు ఎర్రంనీడి పద్మావతి కోరారు. ఈ మేరకు కరప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి సాదిక్ ఖాన్‌పై వచ్చిన మోసం, బెదిరింపులు, ఆర్థిక దోపిడీ ఆరోపణలను పూర్తిస్థాయిలో విచారించాలని ఆమె కోరారు. ప్రైవేట్ ఫొటోలు, వీడియోలను ఉపయోగించి కుటుంబ సభ్యులను బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయని, ఈ అంశాలపై ఆధారాలతో దర్యాప్తు చేసి నిజానిజాలను వెలుగులోకి తేవాలని అన్నారు. నూకరాజు కుటుంబం తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ఘటనకు దారి తీసిన పరిస్థితులను సమగ్రంగా పరిశీలించాలని పద్మావతి కోరారు. సాదిక్ ఖాన్ ఢిల్లీలో పట్టుబడినట్లు వస్తున్న సమాచారాన్ని కూడా ధ్రువీకరించి, అతడికి ఇతర వ్యక్తులు లేదా సంస్థలతో ఉన్న సంబంధాలపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాద సంబంధాలపై వస్తున్న ఆరోపణలను కూడా అధికారిక దర్యాప్తులో నిర్ధారించాలని అన్నారు. 'లవ్ జిహాద్' పేరుతో ఆరోపణలు ఎదురవుతున్న ఘటనలపై ప్రభుత్వం, పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించాలని పద్మావతి కోరారు. బాధితులు ఫిర్యాదు చేసినప్పుడు వాటిని తీవ్రంగా పరిగణించి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇటువంటి ఘటనలకు సంబంధించి అందిన ఫిర్యాదులు, నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి, తీసుకున్న చర్యలపై డీజీపీ, హోంశాఖ మంత్రి ప్రజలకు వివరాలు వెల్లడించాలని ఆమె డిమాండ్ చేశారు. హిందూ మహిళలు, బాలికల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టి, యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఏఈ నూకరాజు కుటుంబ ఘటనలోని ప్రతి అంశాన్ని నిష్పక్షపాతంగా విచారించి, బాధ్యులెవరైనా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని పద్మావతి విజ్ఞప్తి చేశారు.

# మత్స్యకార కుటుంబాలకు జనసేన పార్టీ అండగా

## - నిత్యావసర సరుకులు పంపిణీ చేసిన జనసేన పార్టీ





**అల్లవరం, (రాజధాని వార్తలు):** సముద్రంలో వేటకు వెళ్లి జాడ తెలియకుండా పోయిన మత్స్యకార కుటుంబాలకు జనసేన పార్టీ అండగా నిలిచింది. అల్లవరం మండల పరిధిలోని ఓడలరేవు, ఆరకట్లపాలెం, కొమరగిరిపట్నం, నక్క రామేశ్వరంకు చెందిన 5 గురు మత్స్యకారులు కుటుంబాలకు జనసేన పార్టీ బియ్యం, వంట నూనె, నిత్యవ సర సరుకులను అందజేశారు. మిగిలిన రెండు కుటుంబాలు ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలో ఉండడంతో ముమ్మిడివరం మండల జనసేన పార్టీ నాయకులకు సమాచారం ఇచ్చి అక్కడ ఉన్న ఆ రెండు మత్స్యకార కుటుంబాలకు బియ్యం, నిత్యవసర సరుకులు అందజేసి అండగా నిలవాలని కోరమని ముమ్మిడివరం మండల జనసేన పార్టీ ఆ ఇరువురి కుటుంబాలకు నిత్యవసర సరుకులు అందజేసి అండగా నిలుస్తుందని జనసేన పార్టీ నాయకులు తెలిపారు. అల్లవరం మండలం ఓడల రేవు వద్ద ఆగస్టు 3వ తేదీన ఓడలరేవు ఫిషింగ్ ల్యాండింగ్ సెంటర్ నుండి బోటులో 7 మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లి జాడ తెలియకుండా పోయారు. అమలాపురం నియోజకవర్గం పరిధిలో జాడ తెలియని 5 గురు మత్స్యకారుల కుటుంబ బాధితులను మంగళవారం కలుసుకొని ధైర్యం నింపి నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అమలాపురం నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు కల్వకులను తాతాజీ, ఇసుకపట్ల రఘుబాబు, కంకిపాటి వీరబాబు, కామాడి గంగా భవని, కటికరెడ్డి బాబి, ఉండ్రు సుధాకర్, వర్రే సూరిబాబు, పిండి గణపయ్య, గోళ్ళ కమల, చిక్కం సుధ, యర్రంశెట్టి నాగేశ్వరరావు, కుంపట్ల రమేష్, సూర్య మోహన్, రాజు, అల్లవరం మండలం జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు వీర మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# "మిలాద్ ఉన్ నబీ" ప్రశాంతంగా జరుపుకోవాలి




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం డివిజన్ పరిధిలో "మిలాద్ ఉన్ నబి" వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని పెద్దాపురం డిఎస్పి ఎ బాలగంగాధర్ తిలక్ ఆదేశించారు. మంగళవారం జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు ముస్లీమ్ సంఘాల నాయకులతో ప్రత్యేక సమావేశాన్ని డిఎస్పి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మత పెద్దలు యువత వేడుకలను చక్కటి వాతావరణంలో ఆహ్లాద భరితంగా ఉత్సవాలు నిర్వహించాలన్నారు. అలాగే ప్రజలు పోలీసులకు సహకరించాలని డిఎస్పి తిలక్ కోరారు. అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా మత పెద్దలు ముందుగానే జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించారు. పెద్దాపురం డివిజన్లో వేడుకలను పురస్కరించుకుని పోలీసులు పూర్తి భద్రత, నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు డిఎస్పి తెలిపారు. ఈ కార్యక్రమంలో సామర్లకోట సిఐ కృష్ణ భగవాన్, పెద్దాపురం సీఐ వై ఆర్ కే శ్రీనివాస్, ముస్లీం మత పెద్దలు పాల్గొన్నారు.

# నేడు కలెక్టరేట్‌లో మినీ ఉద్యోగ మేళా

## - నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్

**అమలాపురం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ నెల 27వ తేదీ గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో మినీ ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా.మహేష్ కుమార్ తెలిపారు. ఈ ఉద్యోగ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకుని తమకు అనుకూలమైన ఉద్యోగ అవకాశాలను పొందాలని కలెక్టర్ సూచించారు. యువత తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఉద్యోగ మేళాలో ఇంటర్వ్యూలు ఉదయం 10.00 గంటల నుంచి ప్రారంభమవుతాయని కలెక్టర్ తెలిపారు. వికాస జిల్లా మేనేజర్ గోళ్ళ రమేష్ మాట్లాడుతూ ఈ మినీ ఉద్యోగ మేళాలో వివిధ ప్రముఖ నాలుగు ఎంఎన్‌సీ కంపెనీలు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు ఉద్యోగ మేళాకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. 19 నుంచి 28 సంవత్సరాల వయస్సు కలిగిన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు అవసరమైన విద్యార్హతల ధ్రువపత్రాలను తీసుకుని ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. నెల్లూరు, బెంగళూరు, అనంతపురం ప్రాంతాల్లో పనిచేసేందుకు 300కు పైగా ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. జిల్లాలోని అర్హత కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి ఉద్యోగాన్ని సాధించుకోవాలని వికాస అధికారులు కోరారు.

# త్రిష, తమన్నా కల నెరవేరింది.. కయాదు వంతు ఎప్పుడు?



కయాదు లోహర్‌కు ఫ్లైట్ జర్నీ ఊహించని ఫ్యాన్ మూమెంట్‌గా మారింది. తన పక్క సీటులో రజినీకాంత్ కనిపించడంతో వెంటనే సెల్ఫీ తీసుకుని సోషల్ మీడియాలో షేర్ చేసింది. రజినీని చూడగానే దళపతిలోని సుందరి పాట గుర్తొచ్చిందని చెప్పిన కయాదు.. ఏదో ఒక రోజు ఆయనతో స్క్రీన్ షేర్ చేయాలనే కోరికను కూడా బయటపెట్టింది. రజినీతో నటించాలని కోరుకున్న నటీనటుల లిస్ట్ ప్రతీ ఇండస్ట్రీలో ఉంటుంది. త్రిషకు కూడా ఇది చాలా కాలం వెంటాడిన డ్రీమ్. 2018లో పేటలో అవకాశం వచ్చినప్పుడు తన కెరీర్ ఒక సర్కిల్ పూర్తి చేసుకున్నట్లు అనిపిస్తోందని చెప్పింది. రజినీకి ముందు ఫ్యాన్‌ని, ఆ తర్వాతే కోస్టార్‌ని అంటూ అప్పట్లో తన ఆనందాన్ని పంచుకుంది. చాలా ఏళ్లుగా ఎదురుచూసిన కాంబినేషన్ చివరకు ఆ సినిమాతో కుదిరింది. తమన్నాకు కూడా జైలర్‌తో అలాంటి అవకాశం వచ్చింది. రజినీతో పని చేయడం తన కల నెరవేరిన మూమెంట్ అని ఆమె చెప్పింది. కాజల్ అగర్వాల్ అయితే 2017లోనే తన విష్‌లిస్ట్‌లో రజినీకాంత్ పేరు ఉందని ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. కానీ ఇప్పటి వరకు ఆ కాంబినేషన్ మాత్రం సెట్ కాలేదు. అంటే కోరిక చెప్పగానే సినిమా వచ్చేస్తుందనే లెక్క లేదు. రజినీ సినిమాల్లో సరైన పాత్ర, దర్శకుడి ప్లాన్ రెండూ కలవాలి. కయాదు విషయంలో మాత్రం ప్రస్తుతం కెరీర్ స్పీడ్ బాగుంది. డ్రాగన్ తర్వాత తమిళంలో మంచి గుర్తింపు వచ్చింది. ఈ ఏడాది ఫంకీ, పల్లిచట్టంబి, ఇదయం మురళి సినిమాల్లో కనిపించింది. ఇప్పుడు నాని ది ప్యారడైజ్‌తో పాటు ఇమ్మోర్టల్, సూర్య 48, ఐయామ్ గేమ్, మంజనాథిలాంటి సినిమాలు లైనప్‌లో ఉన్నాయి. తెలుగు, తమిళం, మలయాళంలో ఒకేసారి అవకాశాలు రావడం ఆమెకు పెద్ద ప్లస్. మరోవైపు రజినీ ఇప్పటికీ కొత్త తరం హీరోయిన్లు, నటులతో వరుసగా సినిమాలు చేస్తున్నారు. ప్రస్తుతం జైలర్ 2 అక్టోబర్ 15 రిలీజ్‌కు సిద్ధమవుతుండగా, ధర్మన్ షూటింగ్ కూడా జరుగుతోంది. అంటే రాబోయే సినిమాల్లో కొత్త కాంబినేషన్లకు అవకాశం లేకపోలేదు.

కానీ కయాదు కోసం ఏదైనా ప్రాజెక్ట్ ఉందని మాత్రం ఇప్పటివరకు సమాచారం లేదు. ఇప్పటికి కయాదుకు దొరికింది రజినీ పక్క సీటు మాత్రమే. కానీ త్రిష, తమన్నా లాంటి హీరోయిన్లకు ఒకప్పుడు ఫ్యాన్‌గా ఉన్న కోరిక తర్వాత నిజంగానే స్క్రీన్ మీద నెరవేరింది. కయాదు కూడా ప్రస్తుతం పెద్ద సినిమాల వైపు వెళ్తున్న సమయంలో తన కోరికను బయటపెట్టింది. మరి ఈ ఫ్లైట్ సెల్ఫీ ఎప్పుడైనా ఒక సినిమా ఫొటోగా మారుతుందేమో చూడాలి.

# టాక్సిక్ స్క్రీన్స్.. ఇరుముడి వైపు తిరుగుతాయా?





యశ్ టాక్సిక్ రావడంతో తెలుగు రాష్ట్రాల్లో థియేటర్ల నెంబర్ ఒక్కసారిగా మారింది. తొలి రోజు భారీ ఓపెనింగ్ కోసం ఈ సినిమాకు ఎక్కువ స్క్రీన్స్, షోలు కేటాయించారు. ఆ ప్రభావం అప్పటికే మంచి రన్‌లో ఉన్న రవితేజ ఇరుముడిపై కూడా పడింది. ఇప్పుడు టాక్సిక్ ఫస్ట్ షోలు పూర్తయ్యాక వస్తున్న స్పందన మిక్స్‌గా ఉండటంతో అసలు థియేటర్ల లెక్క వీకెండ్ వరకు అలాగే ఉంటుందా అన్న ప్రశ్న మొదలైంది. టాక్సిక్‌కు మాత్రం మొదటి రోజు బుకింగ్స్ చాలా బలంగా ఉన్నాయి. యశ్ నాలుగేళ్ల తర్వాత రావడం, కేజీఎఫ్ తర్వాత సినిమా కావడంతో రిలీజ్ రోజు వరకు టికెట్ సేల్స్ భారీగా జరిగాయి. తెలుగు రాష్ట్రాల్లో కూడా చివరి సమయంలో బుకింగ్స్ వేగం పెరిగింది. పైగా తెలంగాణలో టికెట్ హైక్‌కు అనుమతి కూడా వచ్చింది. ఇంత పెద్ద ఓపెనింగ్‌తో వచ్చిన సినిమాకు ఒక్కరోజులోనే స్క్రీన్స్ తగ్గించే అవకాశం తక్కువ. కనీసం తొలి రెండు మూడు రోజుల డిమాండ్‌ను చూసే వరకు డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు వెయిట్ చేసే ఛాన్స్ ఉంటుంది అనేది అసలు డౌట్. ఇక ఇరుముడి దగ్గర పరిస్థితి వేరు. సినిమా ఆగస్టు 21 నుంచి థియేటర్లలో ఉంది. వీకెండ్ తర్వాత కూడా సోమ, మంగళవారాల్లో మంచి హోల్డ్ కనిపించింది. మంగళవారం ఇండియా నెట్ రూ.12 కోట్లకు పైగా వచ్చినట్లు ట్రేడ్ లెక్కలు చెబుతున్నాయి. బుక్‌మైషోలో కూడా అదే రోజు 3.55 లక్షల టికెట్లు అమ్ముడయ్యాయి. అంటే కొత్త సినిమా వచ్చినా ఇరుముడికి ఇంకా ఆడియన్స్ ఉన్నారనే బేస్ ఉంది. ఇక్కడ థియేటర్ల నెంబర్ కంటే ముందు షోల లెక్క మారే అవకాశం ఎక్కువ. ముఖ్యంగా మల్టీప్లెక్స్‌లలో ఏ సినిమాకు ఆక్యుపెన్సీ ఎక్కువగా ఉంటే దానికి అదనపు షోలు ఇవ్వడం పెద్ద విషయం కాదు. టాక్సిక్‌కు తీసుకున్న అన్ని షోలు అదే స్థాయిలో నిండకపోతే వాటిలో కొన్ని ఇరుముడి వైపు వెళ్లొచ్చు. సింగిల్ స్క్రీన్స్ విషయంలో మాత్రం ముందే చేసుకున్న ఒప్పందాలు ఉండటంతో మార్పు అంత వెంటనే జరగకపోవచ్చు. ఇప్పటివరకు ఇరుముడికి స్క్రీన్స్ తగ్గకూడదనే మాట కూడా రిలీజ్‌కు ముందే ట్రేడ్‌లో వచ్చింది. సినిమా మంచి రన్‌లో ఉన్న సమయంలో టాక్సిక్ భారీగా రావడంతో ఏ సినిమాకు ఎంత స్పేస్ ఇవ్వాలన్నది అప్పుడే ఒక లెక్కగా మారింది. ఇప్పుడు ఆ నిర్ణయం ప్రేక్షకుల చేతిలోకి వచ్చింది. ఏ షోకు టికెట్లు ఎక్కువగా వెళ్తాయో అక్కడికే థియేటర్లు కూడా మొగ్గు చూపుతాయి. అందుకే అసలు మార్పు ఈరోజు కంటే శుక్రవారం నుంచి కనిపించే అవకాశం ఉంది. టాక్సిక్ తన భారీ ఓపెనింగ్ తర్వాత కూడా ఆక్యుపెన్సీ నిలబెట్టుకుంటే ఇప్పటి స్క్రీన్ కౌంట్ కొనసాగొచ్చు. ఇరుముడి మాత్రం ఏడో రోజు తర్వాత కూడా అదే హోల్డ్ చూపిస్తే వీకెండ్‌కు అదనపు షోలు తిరిగి దక్కే ఛాన్స్ ఉంటుంది. ఈసారి రెండు సినిమాల మధ్య పోటీ కలెక్షన్స్ దగ్గరే కాదు.. వీకెండ్ షోల దగ్గర కూడా కనిపించబోతోంది.

# ఉపేంద్ర ఓపెన్ చేసిన మార్కెట్.. యశ్ ఎక్కడికి తీసుకెళ్లాడు





తెలుగు రాష్ట్రాల్లో కన్నడ హీరోలకు ఇప్పుడున్న మార్కెట్ ఒక్కసారిగా రాలేదు. ఒకప్పుడు కన్నడలో హిట్ అయిన సినిమా తెలుగులో డబ్ అయితే ఇక్కడ ఎంతవరకు వెళ్తుందో చూసేవారు. హీరో పేరు మీద భారీ రిలీజ్ అనే పరిస్థితి చాలా తక్కువ. ఆ లెక్కను మొదట బలంగా మార్చిన వాళ్లలో ఉపేంద్ర ఒకరు. ఇప్పుడు యశ్ సినిమాకు తెలుగు రాష్ట్రాల్లో టికెట్ హైక్ వచ్చే స్థాయికి మార్కెట్ వచ్చింది. కానీ మధ్యలో దాదాపు మూడు దశాబ్దాల జర్నీ ఉంది. ఉపేంద్రకు ఏ, ఉపేంద్ర సినిమాలు కన్నడతో పాటు తెలుగులో కూడా మంచి గుర్తింపు తెచ్చాయి. ఏ తెలుగు వెర్షన్ అప్పట్లో 100 రోజులు ఆడగా, ఉపేంద్ర కూడా ఆంధ్రప్రదేశ్‌లో మంచి రన్ తీసుకుంది. ఆ గుర్తింపుతోనే ఆయనకు కన్యాదానం లాంటి స్ట్రెయిట్ తెలుగు సినిమా వచ్చింది. తర్వాత రా కూడా చేశాడు. అంటే కన్నడ నుంచి వచ్చి తెలుగులో తన పేరుతో ప్రేక్షకులను థియేటర్లకు తీసుకొచ్చిన తొలి హీరోల్లో ఉపేంద్ర ముందుంటాడు. తర్వాత సుదీప్‌కు ఇక్కడ పేరు బాగా తెలిసింది. అయితే అది పూర్తిగా కన్నడ డబ్బింగ్ మార్కెట్‌తో వచ్చింది కాదు. రాజమౌళి ఈగలో చేసిన నెగెటివ్ పాత్ర ఆయనను తెలుగు ప్రేక్షకులకు దగ్గర చేసింది. తర్వాత విక్రాంత్ రోణను తెలుగులో కూడా పెద్ద స్థాయిలో రిలీజ్ చేశారు. తొలి వారంలో తెలుగు వెర్షన్‌కు దాదాపు 370 స్క్రీన్స్ దొరికాయి. దర్శన్ కూడా రాబర్ట్‌తో తెలుగు మార్కెట్‌ను ట్రై చేశాడు. ఏపీ, తెలంగాణలో భారీ సంఖ్యలో థియేటర్లు తీసుకున్నా, ఆ ప్రయత్నం తర్వాత ఆయనకు ఇక్కడ ప్రత్యేకమైన మార్కెట్ మాత్రం స్థిరపడలేదు. ఇక రిషబ్ శెట్టి మరో రూట్ చూపించాడు. కాంతార వచ్చేముందు తెలుగులో ఆయనకు స్టార్ మార్కెట్ లేదు. కానీ సినిమా కన్నడలో హిట్ అయిన తర్వాత తెలుగు వెర్షన్ వచ్చింది. చివరకు ఏపీ, తెలంగాణ కలిపి దాదాపు రూ.58.85 కోట్ల గ్రాస్ వరకు వెళ్లింది. అంటే ముందు హీరో మార్కెట్ ఉండాలి అనే లెక్కను కాంతార పూర్తిగా పక్కన పెట్టింది. సినిమా నచ్చితే తర్వాత హీరో పేరే మార్కెట్‌గా మారొచ్చని చూపించింది. యశ్ దగ్గరకు వచ్చేసరికి ఈ లెక్క మరో స్థాయికి వెళ్లింది. కేజీఎఫ్ మొదటి భాగం తెలుగు రాష్ట్రాల్లో రూ.12.18 కోట్ల షేర్‌తో క్లోజ్ అయ్యింది. రెండో భాగం వచ్చేసరికి అదే మార్కెట్ ఏకంగా రూ.86.15 కోట్ల షేర్ వరకు పెరిగింది. ఇప్పుడు టాక్సిక్‌కు పరిస్థితి ఇంకా వేరుగా ఉంది.

ఇది కేజీఎఫ్ ఫ్రాంచైజీ సినిమా కాదు. అయినా ఏపీ, తెలంగాణలో భారీ రిలీజ్‌తో పాటు ప్రభుత్వాలు టికెట్ ధరల పెంపునకు కూడా అనుమతి ఇచ్చాయి. అంటే కన్నడ సినిమా తెలుగులో ఏదో జస్ట్ డబ్ అవ్వడం లేదు. ఇప్పుడు కన్నడ హీరో సినిమా ఏకంగా తెలుగు మార్కెట్‌ను డామినేట్ చేసే పరిస్థితి వచ్చింది. ఇక ఈ ట్రాక్‌ను నెక్స్ట్ ఎవరు ఏ స్థాయిలో పెంచుతారో చూడాలి.

# నిర్మాతలుగా సత్తా చాటుతున్న స్టార్ హీరోయిన్లు!







కొన్ని సంవత్సరాల క్రితం వరకు హీరోయిన్లు గ్లామర్ పాత్రలకు...పరిమితమైన నటనకు మాత్రమే పరిమితమయ్యేవారు. తెరపై అందంగా కనిపించడం, పాటలకు డ్యాన్స్ చేయడం వరకే కెరీర్ పరిమితమై ఉండేది. కానీ కాలం మారింది. కాలంతో పాటు నటీమణుల ఆలోచనా విధానం కూడా పూర్తిగా మారిపోతుంది. కేవలం నటిగా మాత్రమే కాకుండా తెరవెనుక బాధ్యతలను భుజాన వేసుకుంటూ నిర్మాణ రంగంలోనూ తమదైన ముద్ర వేస్తున్నారు. సౌత్ ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో లేడీ సూపర్‌స్టార్‌గా వెలుగొందుతున్న నయనతార ఈ ట్రెండ్‌కు చక్కని ఉదాహరణగా నిలుస్తున్నారు. భర్త విగ్నేష్ శివన్‌తో కలిసి రౌడీ పిక్చర్స్ బ్యానర్‌ను స్థాపించి పలు ప్రయోగాత్మక చిత్రాలను నిర్మిస్తున్నారు. తమిళ సినిమాలకే పరిమితం కాకుండా ఇతర భాషా చిత్రాలపై కూడా దృష్టి పెడుతున్నారు. స్ట్రాంగ్ స్క్రిప్ట్‌లు ఎక్కడ దొరికితే అక్కడ నిర్మించడానికి రెడీగా ఉన్నారు. నయన్ ఇటీవల గుజరాతి సినిమా శుభయాత్రను కూడా నిర్మించి ఆశ్చర్యపరిచారు. బాలీవుడ్ విషయానికి వస్తే అగ్ర హీరోయిన్ అలియా భట్ నిర్మాతగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఎటర్నల్ సన్‌షైన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌ను స్థాపించి దూసుకుపోతున్నారు. ఇప్పటికే డార్లింగ్స్, జిగ్రా వంటి వైవిధ్యమైన సినిమాలను నిర్మించిన సంగతి తెలిసిందే. తాజాగా డోంట్ బి షై అనే చిత్రాన్ని కూడా ప్రకటించారు. ఇలా అలియాభట్ నిర్మాతగా.. నటిగానే బిజీగా ఉన్నారు. ఇదే బాటలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్లుగా ఉన్న కృతి సనన్ .. సమంత కూడా నిర్మాతలుగా అదే జోరును ప్రదర్శిస్తున్నారు. కృతి సనన్ తన సొంతం నిర్మాణ సంస్థను ప్రారంభించి కంటెంట్ ఓరియెంటెడ్ కథలతో పాటు విభిన్నమైన ప్రాజెక్ట్‌లను ప్లాన్ చేస్తున్నారు. మరోవైపు సమంత ట్రాలా లాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌ను స్థాపించి, బలమైన భావోద్వేగాలు ఉన్న కథలను ఎంచుకుని నిర్మాణ రంగంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకుంటున్నారు. నటీమణులు ఇలా నిర్మాణ రంగంలోకి అడుగు పెట్టడానికి కారణం కేవలం వ్యాపార దృక్పథం మాత్రమే కాదు. నచ్చిన కథలను ప్రేక్షకులకు అందించాలనే తపనే ప్రధాన కారణం.

మగవారు ఆధిపత్యం చెలాయించే ప్రొడక్షన్ రంగంలో మహిళలు అడుగుపెట్టి విజయాలు సాధించడం ఇండస్ట్రీలో సానుకూల పరిణామంగా చెప్పొచ్చు. లేడీ ఓరియేంటెడ్ కథలకు పెద్దపీట వేయడానికి ఈ స్టార్ హీరోయిన్ల ప్రొడక్షన్ వెంచర్లు ఎంతగానో దోహద పడుతు న్నాయి. తెరపై అద్భుతమైన నటనతో కోట్లాది మంది అభిమా నులను అలరిస్తున్న స్టార్ హీరోయిన్లు తెర వెనుక సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్లుగా రాణించడం ప్రశంసనీయం. వారి సాహసోపే తమైన అడుగులు రాబోయే యువ నటీమణులకు గొప్ప మార్గదర్శకంగా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# తెలుగుకు గొడుగు పట్టిన గిడుగు

## - రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షులు త్రివిక్రమరావు





**విజయనగరం, (రాజధాని వార్తలు):** వ్యావహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు తెలుగు వారికి చిరస్మరణీయుడని, తెలుగుకు గొడుగు పట్టిన గిడుగుకు మన గుండెల్లో సుస్థిర స్థానం పదిలపరచాలని రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షులు పి.త్రివిక్రమరావు పేర్కొన్నారు.

తెలుగు భాషా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ ఆధ్వర్యంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక వైభవం పేరుతో గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకుని సన్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఉత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ భాషకోసమే తన జీవితమంతా పోరాటం చేసిన కలం యోధుడు, తెలుగు భాషకు దశ, దిశ నిర్దేశించిన భాషా వైతాళికులు, గ్రాంధిక భాష మార్గం మార్చి, వాడుక భాషకు ప్రాణం పోసిన మేరునగధీరుడు గిడుగు రామమూర్తి పంతులు అని, 'కావ్య భాష వద్దు - వ్యవ హారిక భాష ముద్దు" అనే నినాదంతో ఉద్యమం చేపట్టి తెలుగు సాహిత్యంలో చారిత్రాత్మక మార్పుకు శ్రీకారం చుట్టారని అన్నారు. సముద్రాల గురుప్రసాద్ మాట్లాడుతూ మన తెలుగు ప్రాచీన భాష, శాతవాహనుల కాలంలో జనించి, మధ్యయుగకాలంలో ప్రరిఢవిల్లి, 'దేశ భాషలందు తెలుగు లెస్స' అన్న కీర్తిగడించిన తెలుగు వారిగా పుట్టినందుకు గర్వపడాలని అన్నారు.

**తెలుగు భాషా పరిరక్షణకు గాను గిడుగు రామమూర్తి సేవా పురస్కారాల ప్రదానం:**

మధురమైన మాతృభాషను పరిరక్షణకు విశేష కృషి చేస్తున్నందులకు వాగ్దేవీ సమారాధనమ్ వ్యవస్థాపకురాలు ప్రొఫెసర్ స్వప్న హైందవికి, అయోధ్య బాలక్ రామమందిర్ ట్రస్ట్ అధ్యక్షులు కుసుమంచి సుబ్బారావుకు, భాష, సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణలో కృషి చేస్తున్నందులకు సన్ స్కూల్‌కు గిడుగు రామ మూర్తి సేవా పురస్కారాలను గురుప్రసాద్‌తో కలసి అధికార భాషా సంఘం అధ్యక్షులు పి.త్రివిక్రమరావు ప్రదానం చేసారు. ఈ కార్యక్రమాన్ని ప్రాజక్టు ఛైర్‌పర్సన్ గురాన రాధిక జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు. ఈ సమావేశంలో సన్ స్కూల్ డీన్ రంగా, సమైక్య భారతి సమన్వయకర్త కన్నయ్య, శ్రీశ్రీ కళా వేదిక అధ్యక్షులు సీతారామమూర్తి, తెలుగు భాషా పరిరక్షణ సమితి సలహాదారులు ముళ్లపూడి సుభద్రాదేవి, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు గిరిజా ప్రసన్న, ప్రధాన కార్యదర్శి సాలూరు సంతోషి, ఈపు విజయ్‌కుమార్, డిమ్స్ రాజు, ప్రముఖ వ్యాపారవేత్త డివి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# డయేరియా రాకుండా స్పెషల్ డ్రైవ్

## - ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలి : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లాలో ఎక్కడా డయేరియా ప్రభలకుండా అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలను చేపట్టాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. దీనికోసం స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని డిపిఓ, జెడ్‌పి సిఈఓ, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ కమిషనర్లు, డిఎంఅండ్‌హెచ్‌ఓలకు సూచించారు. దీనిలో భాగంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టి, పేరుకుపోయిన చెత్తను తరలించాలని, కాలువలను శుభ్రపరచాలని, మురుగు నీరు, వర్షపు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చూడాలని, త్రాగు నీటి పరీక్షలను నిర్వహించాలని, పైప్‌లైన్లు కాలువల్లో లేకుండా చేయాలని ఆదేశించారు. సోమవారం సాయంత్రం వివిధ శాఖల అధికారులు, ఆన్‌లైన్ ద్వారా తహసీల్దార్లు, ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్షా సమావేశాన్ని కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత ఏడాది జిల్లాలో ఎక్కడా డయేరియా రాకుండా చర్యలు తీసుకున్నారని, ఈ ఏడాది కూడా అదేవిధమైన కట్టుదిట్టమైన చర్యలను తీసుకోవాలని ఆదేశించారు. దీనికోసం ఆయా శాఖలకు పలు ఆదేశాలను జారీ చేశారు. ముఖ్యంగా పారిశుధ్యంపై దృష్టిపెట్టి, ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఎక్కడ డయేరియా ప్రబలినా, వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ముందుగా డిడిఓలంతా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి, తనిఖీలు చేయాలని సూచించారు. 22ఏ, పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ, రీ సర్వే, సర్ పై సమీక్షించారు. సర్ ప్రక్రియలో భాగంగా గుర్తించిన లక్షా, 93వేల మందికి నోటీసులు జారీ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలన్నారు. వివిధ ఇంజనీరింగ్ విభాగాల్లో పెండింగ్ పనులపై ఆరా తీశారు. వివిధ శాఖల పనితీరుపై సమీక్షిస్తూ అన్ని శాఖలూ తప్పనిసరిగా ఏ లేదా ఏం ర్యాంకింగ్ సాధించాలని, దానికి తగ్గ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్ మాట్లాడుతూ, స్వచ్ఛాంధ్ర అవార్డుల గురించి వివరించారు. దీనిపై మంగళవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. మొత్తం 21 విభాగాల్లో రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయిలో అవార్డుల ప్రధానం ఉంటుందన్నారు. ఎక్కువ అవార్డులను సాధించేందుకు ప్రభుత్వ శాఖలు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి డిఆర్‌ఓ కె.అరుణకుమారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కన్నుల పండుగగా సాహిత్య సాంస్కృతిక వైభవం





**విజయనగరం, (రాజధాని వార్తలు):** తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ ఆధ్వర్యంలో గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సాహిత్య సాంస్కృతిక వైభవం కన్నుల పండుగగా సాగింది. డాక్టర్ బి.రాధికారాణి నృత్య దర్శకత్వంలో నర్తనశాల విద్యార్థులు, భైరవ భట్ల మంజూష నృత్య దర్శకత్వంలో అభినయ కళాక్షేత్రం విద్యార్థులు, వాగ్దేవి నృత్య దర్శకత్వంలో శ్రీ సాయి వాగ్దేవి మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ విద్యార్థులు, అనుపోజు ప్రవీణ్ కుమార్ ఆచార్య నృత్య దర్శకత్వంలో శ్రీ విశ్వకర్మ డాన్స్ అకాడమీ విద్యార్థులు, శ్రీదేవి కృష్ణ నృత్య దర్శకత్వంలో శ్రీ మయూరి నృత్యాలయ విద్యార్థులు తమ నాట్యంతో ఆద్యంతం అలరించారు. తెలుగు పద్య సోయగం పేరుతో ఏర్పాటు చేసిన ఉత్సవంలో కాగుపాటి నారాయణమూర్తి, ప్రొఫెసర్ స్వప్న హైందవి, శిరీష రఘురాం, కె బాబూరావు, వి.రమణ, పి.దామోదర్ నాయుడు తమ పద్యపఠనంతో తెలుగు భాష వైభవాన్ని చాటి చెప్పారు. నంది పురస్కార గ్రహీత దాసరి తిరుపతి నాయుడు, మండా రమేష్ ఏకపాత్రాభినయాలతో ఉర్రూతలూగించారు.

# ఉన్నత విద్యకు పేద విద్యార్థికి చేయూత

## - విద్యార్థి ఉన్నత విద్యకు సమాచారం వాట్సాప్ గ్రూప్ సభ్యుల చేయూత - రూ.25 వేల ఆర్థిక సహాయం అందజేత

**భద్రాచలం, (రాజధాని వార్తలు):** భద్రాచలం పట్టణానికి చెందిన ఆర్.అఖిల్ అనే విద్యార్థికి ఇబ్రహీంపట్నంలోని సెయింట్ ఇంజనీరింగ్ కాలేజీలో ఈసీఈ విభాగంలో సీటు లభించింది. అయితే ఏడాదికి రూ.50 వేల కాలేజీ ఫీజు చెల్లించే స్థోమత లేకపోవడంతో విద్యార్థి కుటుంబం ఆందోళనకు గురైంది. బుధవారం లోపు ఫీజు చెల్లించాలని కళాశాల యాజమాన్యం గడువు విధించడంతో విద్యార్థి పరిస్థితి తెలుసుకున్న సమాచారం వాట్సాప్ గ్రూప్ సభ్యులు స్పందించారు. సమాచారం గ్రూప్ అడ్మిన్ విజ్జిగిరి రాజా కిరణ్ ఆధ్వర్యంలో గ్రూప్ సభ్యుల సహకారంతో 'చిన్నారి చేయూత' కార్యక్రమం ద్వారా మంగళవారం అఖిల్ ఉన్నత విద్యకు బాసటగా రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా రాజా కిరణ్ మాట్లాడుతూ 2018లో ప్రారంభమైన సమాచారం గ్రూప్ గత 8 ఏళ్లుగా అనేక మంది విద్యార్థులకు విద్యా సహాయం అందించడంతో పాటు అనారోగ్యంతో




బాధ పడుతున్న వారికి, ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తోందన్నారు. సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న గ్రూప్ సభ్యులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. సమాచారం గ్రూప్ సేవా ప్రయాణం కొనసాగడానికి సభ్యుల సహకారమే ప్రధాన కారణమని పేర్కొన్నారు.

# మజ్జి శివకుమార్‌కు అరుదైన గౌరవం

**విజయనగరం, (రాజధాని వార్తలు):** ప్రముఖ పాత్రికేయులు సీనియర్ సంపాదకులు మజ్జి శివకుమార్‌కు అరుదైన గౌరవం లభించింది. తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక వైభవం అనే ఉత్సవంలో భాగంగా మజ్జి శివకుమార్‌ను ఘనంగా సత్కరించారు. తెలుగు భాష పరిరక్షణ కోసం సంస్కృతి సాంప్రదాయాలు పరిరక్షణ కోసం పాత్రికేయ రంగం నుంచి విశేషమైన సేవలు అందిస్తున్నందుకు గాను రాష్ట్ర అధికార భాష సంఘం చైర్మన్ త్రివిక్రమ రావు చేతుల మీదుగా మజ్జి శివకుమార్ ను ఘనంగా సత్కరించారు .



# రీ సర్వే, పాస్ పుస్తకాల పంపిణీ వేగవంతం చెయ్యాలి

## - జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్





**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లాలో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ, సమగ్ర భూ సర్వే ప్రక్రియలను మరింత వేగవంతం చేయాలని సంయుక్త కలెక్టర్ ఎస్. సేధు మాధవన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం నాడు విజయనగరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ శాఖ అధికారులతో ఆయన సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సెప్టెంబర్ మరియు అక్టోబర్ నెలల లక్ష్యాలు, వెబ్లాండ్ మ్యుటేషన్లు, రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్ మరియు పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, సెప్టెంబర్ నెలలో చేపట్టనున్న పాస్ పుస్తకాల పంపిణీకి సంబంధించి ఈ-కేవైసీ ప్రక్రియను పెండింగ్ లేకుండా సత్వరమే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. డ్రాఫ్ట్ ఈ-కేవైసీ 85 శాతానికి పైగా పూర్తయ్యేలా చూసి, పోర్టింగ్ సర్టిఫికెట్లను డి-సెక్షన్‌కు సమర్పించి వెబ్లాండ్-2 కు పోర్ట్ చేయాలని ఆదేశించారు. అలాగే, అక్టోబర్ నెలకు సంబంధించి ప్రతిపాదించిన 80 గ్రామాల్లో లాగిన్ పెండింగ్‌లను తక్షణమే క్లియర్ చేయాలని, తహశీల్దార్, ఆర్డీఓ మరియు జేసీ లాగిన్‌లలో ఎటువంటి జాప్యం జరగకుండా నిర్దేశిత గడువులోగా ప్రక్రియ పూర్తి కావాలని హెచ్చరించారు. జిల్లాలో నాలుగో మరియు ఐదవ విడతల సమగ్ర భూ సర్వే పురోగతిపై సమీక్షిస్తూ, గ్రౌండ్ ట్రూథింగ్ పూర్తయిన గ్రామాల్లో వెక్టరైజేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మాన్యువల్ రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియ భోగాపురం, బొండపల్లి, డెంకాడ మండలాల్లో వంద శాతం పూర్తయిందని, మిగిలిన మండలాల్లో కూడా తహశీల్దార్ ఆమోద ప్రక్రియను త్వరగా ముగించాలని ఆదేశించారు.

ప్రజల నుండి వచ్చే పీజీఆర్ఎస్ అర్జీలు మరియు రెవెన్యూ క్లినిక్స్ ద్వారా అందే విజ్ఞప్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి, నిర్దేశిత కాలపరిమితిలోగా పరిష్కరించాలని జేసీ కోరారు. వెబ్లాండ్ మ్యుటేషన్లు మరియు ఐవీఆర్ఎస్ కాల్స్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అధికారులను అప్రమత్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి అరుణకుమారి, సర్వే ఏ.డి విజయకుమార్, ఆన్లైన్ ద్వారా ఆర్డీఓలు, తహశీల్దార్లు మరియు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# భర్త కోసం భార్య...తండ్రి కోసం కూతురు ఆమరణ నిరాహార దీక్ష

## - బొప్పే విజయలక్ష్మి, కూతురు వెన్నెల.. ఆమరణ నిరాహార దీక్ష దీక్షకు మద్దతు




**భద్రాచలం, (రాజధాని వార్తలు):** భద్రాచలం పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా భర్త కోసం భార్య, తండ్రి కోసం కూతురు చావును కూడా లెక్క చేయకుండా త్వరగా న్యాయం చేయాలని చేస్తున్న ఆమరణ నిరాహార దీక్ష కు సామాజిక ఉద్యమ సంఘాలు, మాల మహానాడు, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్‌ల ఆధ్వర్యంలో మద్దతు తెలియజేశారు. భర్తగా తండ్రిగా చూడాల్సిన వ్యక్తి పట్టించుకోకపోవడంతో న్యాయం చేయాలని ఆమరణ నిరాహార దీక్ష చేయడం కలచి వేస్తుంది, తన తండ్రి కోసం తన భర్త కోసం చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష త్వరగా పరిష్కార మార్గం చూపిస్తుందని ఆశిస్తున్నామని, అందుకోసం కుటుంబ సభ్యులు, కుటుంబ పెద్దలు, కుల పెద్దలు, సామాజిక వాదులు, మానవతా వాదులు, రాజకీయ పార్టీలు జోక్యం చేసుకొని నా కుటుంబాన్ని ఒకటి చేయాలని ఆశిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు అల్లాడి పౌల్ రాజ్, సామాజిక ఉద్యమకారులు అలవాల రాజా పెరియార్, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ నాయకులు దాసరి సాయన్న సంఘీభావం మద్దతు తెలిపారు.

# సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో కుంకుమ పూజలు




**గజపతినగరం, (రాజధాని వార్తలు):** స్థానిక సత్యసాయి మంది రంలో, శ్రీ సత్య సాయి సేవ సమితి గజపతినగరం వారి ఆధ్వ ర్యంలో శ్రావణ మంగళవారం సందర్భంగా శ్రీ వరలక్ష్మి కుంకుమ పూజలు భక్తిశ్రద్ధలతో చేసినట్లు సేవా సమితి సభ్యులు విలేకరులకు తెలియజేశారు. 200 మంది మహిళలతో కుంకుమ పూజ కార్య క్రమం నిర్వహించడం జరిగినది అని సమితి సభ్యులు తెలియజే శారు. కుంకుమ పూజలకు అవసరమైన పూజా సామాగ్రిని స్వామివారి దివ్య ఆశీస్సులతో శ్రీ సత్యసాయి సేవా సమితి గజ పతినగరం వారు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విజయన గరం జిల్లా నుంచి జిల్లా స్పెషల్ కో - ఆర్డినేటర్ కమలసాయి, జిల్లా సేవాదళ్ కో - ఆర్డినేటర్ విజయలక్ష్మి పాల్గొన్నారు. కుంకుమ పూజ కార్యక్రమం ఆద్యంతం భక్తిశ్రద్ధలతో జరిగింది. పూజానంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ గావించినట్లు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ యు.వెంకటేష్ తెలియజేశారు.

# పాఠశాల పిల్లలకు "కిడ్ బ్యాంక్" ప్రారంభం

## - ప్రధానోపాధ్యాయులు కే.చంద్రరావు

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని మర్రివలస పాఠశాలలో చదివే పిల్లల కోసం "కిడ్ బ్యాంక్" అనే కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనకల చంద్రరావు అన్నారు. ఈ సందర్భంగా చంద్రరావు మాట్లా డుతూ కిడ్ బ్యాంక్ ప్రధాన ఉద్దేశాన్ని చెప్పారు. పిల్లలకు తల్లి దండ్రుల కష్టం విలువ తెలియాలి, తల్లిదండ్రులు కష్టపడి సంపాదిస్తున్న ప్రతీ రూపాయి విలువ తెలియాలి అనే ఉద్దేశ్యం తోనే పాఠశాలలో పిల్లలకు ఈ కిడ్ బ్యాంక్ కార్యక్రమాన్ని ప్రారం భించడం జరిగిందని ఆయన అన్నారు. ముఖ్యంగా డబ్బులు పొదుపు చేయడం వలన కలిగే ప్రయోజనాలు పిల్లలకు తెలియాలి అనే ఉద్దేశంతో కూడా కిడ్ బ్యాంక్ ను ప్రారంభించడం జరిగింది అని ఆయన అన్నారు. చిన్నతనంలోనే పిల్లలకు పొదుపు అనే అలవాటు అలవడాలి అనేది ఈ కిడ్ బ్యాంకు ముఖ్య ఉద్దేశ్యం అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.చంద్రరావు తెలియ



జేశారు.

# కార్ల దీప్తి కుటుంబాన్ని పరామర్శించిన ఊటుకూరు నాగార్జున



**గూడూరు, (రాజధాని వార్తలు):** గూడూరు పట్టణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కార్ల దీప్తి తల్లి ఇటీవల మృతి చెందడంతో నెల్లూరు జిల్లా యువ నాయకుడు, 13వ డివిజన్ కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున వారి కుటుంబాన్ని పరామర్శించారు. గూడూరులోని కార్ల దీప్తి నివాసానికి వెళ్లి మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగార్జునా కార్ల దీప్తి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పార్టీ ఎల్లప్పుడూ కార్ల దీప్తి కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కార్యదర్శి కొండూరు సునీల్ రెడ్డి, గూడూరు పట్టణ మహిళా అధ్యక్షురాలు సుజనా రెడ్డి, గూడూరు మండలం ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ వాకాటి కిరణ్ కుమార్, యువజన విభాగం ఉపాధ్యక్షుడు పారిచర్ల మధు, కోట మండలం ఎస్సీ సెల్ అధ్య క్షుడు మద్దూరు స్వరూప్, కోట మండల ప్రధాన కార్యదర్శి పాముల సురేంద్ర, సోషల్ మీడియా వైస్ ప్రెసిడెంట్ శ్రీరాం సురేష్, గూడూరు మండలం రైతు విభాగం కార్యదర్శి రఘు యాదవ్, అల్లం అర్జున్, ఏడుకొండలు, గంప కోటేశ్వరరావు, తూపిలి నాగరాజుతో పాటు పలువురు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పంచారామంలో కలెక్టర్ సతీమణి ప్రత్యేక పూజలు

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పంచారామ క్షేత్రం సామర్లకోట శ్రీ కుమార రామ భీమేశ్వర స్వామి ఆలయంలో కాకినాడ జిల్లా కలెక్టర్ సతీమణి దివ్య ప్రసాద్ మంగళవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె భీమేశ్వర స్వామిని, బాలా త్రిపుర సుందరి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం నంది మండపంలో ఆలయ అర్చకులు, వేద పండితులు వేద ఆశీర్వచ నం అందజేసారు. అనంతరం ఆలయ అధికారి స్వామి వారి ప్రసాదములు, స్వామివారి చిత్రపటం అందజేసారు. ఈ కార్యక్ర మంలో దేవస్థానం అర్చకులు, వేదపండితులు, దేవస్థానం



సిబ్బంది పాల్గొన్నారు.

# దివంగత మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డికి నివాళులర్పించిన శ్రీధర్ వర్మ



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** దివంగత మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి సమాధి వద్ద ఎస్ వి బి సి చైర్మన్ శ్రీధర్ వర్మ మంగళ వారం పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాళ హస్తి నియోజకవర్గంలో నాడు మంత్రిగా శ్రీకాళహస్తి నియోజక వర్గం ఎంతో అభివృద్ధి పథంలో నడిపించారని, తిరుపతి చిత్తూ రుని రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, అలాంటి లీడర్ నాయకత్వాన్ని ఆయన నమ్ముకున్న ప్రతి ఒక్కరు కూడా మంచి ప్రయోజకులు అయ్యారని ఆయన కొనియాడారు. ఆయనకు నివాళులర్పించి ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు విజయ్ కుమార్, మునిరాజా నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# కూటమిలో అభివృద్ధికే అధిక ప్రాధాన్యత...!

## - ఎమ్మెల్యే, డిసిసిబి చైర్మన్‌లచే అభివృద్ధి పనులు ప్రారంభం

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వంలో అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)లు అన్నారు. సామర్లకోట పట్టణ అభివృద్ధిలో భాగంగా పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)లు పట్టణ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్ర మాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహిం చారు. బళ్ళ మార్కెట్ సెంటర్ సమీపాన గల అన్నపూర్ణ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం మార్గం వద్ద సుమారు రూ. 4 లక్షల నిధులతో చేపట్టిన స్టీల్ రైలింగ్‌ను ఎమ్మెల్యే చినరాజప్ప ప్రారంభించారు. అనంతరం పట్టణ పరిధిలో 4,5,6,7 వార్డులలో సుమారు రూ. 10 లక్షలు కౌడ, 15వ ఆర్థిక సంఘ నిధులతో నూత నంగా చేపట్టనున్న సీసీ రోడ్, డ్రైన్ నిర్మాణాలకు ఎమ్మెల్యే చినరాజప్ప, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామిలు కొబ్బరి కాయ కొట్టి శంకుస్థాపన కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్ర మంలో కూటమి నాయకులు రాజా సూరిబాబు రాజు, బడుగు



శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, సరోజ వాసు, కంటే జగదీష్ మోహన్, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, బలుసు వాసు,పిట్టా జానకి రామారావు, ముత్యం రాజబాబు, తుమ్మల ప్రసాద్, అత్తిలి కృష్ణ, అందుగల జార్జి చక్రవర్తి, మంచెం సాయిబాబు, శెట్టిబత్తుల దుర్గ, మడగల శ్యామ్, గుడాల శంకర్, కాళ్ల రవీంద్ర, గొల్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అన్నపూర్ణ ఆలయంలో ఎమ్మెల్యే, డిసిసిబి చైర్మన్‌లు పూజలు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట పట్టణ పరిధిలో గల శ్రీ అన్నపూర్ణ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరా జప్ప, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)లు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే చినరాజప్ప, తుమ్మల బాబులకు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో జరిగిన విశేష పూజల్లో వారు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ స్వామీజీ పరమానంద గురు స్వామి ఆధ్వ ర్యంలో ఆలయ అర్చకులు ఎమ్మెల్యే, డిసిసిబి చైర్మన్ లకు వేద ఆశీర్వచనం పలికి స్వామివారి చిత్రప టాన్ని అంద జేశారు.

ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు నిమ్మకాయల రంగనాగ్, రాజా సూరిబాబు రాజు, బడుగు శ్రీకాంత్, అడబాల కుమార స్వామి, కంటే జగదీశ్ మోహన్, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, బలుసు వాసు, సరోజ వాసు, పిట్టా జానకి రామారావు, మంచెం సాయిబాబు, గోలి వెంకట అప్పారావు చౌదరి, గొల్తీ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బీపీ మండల్ 108వ జయంతి వేడుకలు

**గూడూరు, (రాజధాని వార్తలు):** బీసీల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్న బీసీ సమస్యయకమిటీ ఆధ్వర్యంలో బీసీల ఆరాధ్య దైవం, రెండో బీసీ కమిషన్ చైర్మన్, బీహార్ మాజీ ముఖ్య మంత్రి, బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు జీవితాంతం పోరాడిన మహనీయుడు బిందేశ్వరి ప్రసాద్ మండల్ (బి.పీ. మండల్) 108వ జయంతి వేడుకలను మంగళవారం గూడూ రులో ఘనంగా నిర్వహించారు. గూడూరు కార్‌స్టాండ్ వద్ద ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాల సమీపంలో నిర్వ హించిన కార్యక్రమంలో బి.పీ. మండల్ చిత్రపటానికి పూలమా లలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీసీల సామాజిక, రాజకీయ, విద్యా, ఆర్థిక హక్కుల కోసం మండల్ చేసిన కృషిని ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నారు. బీసీలకు రిజర్వే షన్లు కల్పించేందుకు మండల్ చేసిన పోరా టం దేశవ్యాప్తంగా సామాజిక న్యాయ సాధనకు మార్గదర్శకంగా నిలిచిందని పలు వురు పేర్కొన్నారు.

ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేం దుకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, బహుజన వర్గాలు ఐక్యంగా కృషి చేయాలని



పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి గూడూరు నియోజకవర్గంలోని బీసీ సంఘాల నాయకులు, బహుజన సం ఘాల ప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులు, మేధావులు, అభ్యుదయవాదులు, పుర ప్రముఖులు, ప్రజలు పాల్గొని బి.పీ. మండల్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీ మహాత్మా జ్యోతిరావు పూలే వాషర్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ ఎల్.వీ. సుబ్బయ్య, గౌడ సంఘం నాయకులు నాసిన భాస్కర్ గౌడ్, జి. వెంకటేశ్వరరాజు, ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు యాల్లపల్లి శ్రీనివాసులు, ఎమ్మార్పీఎస్ నాయకులు పొల్లేపల్లి రమణరావు, చిల్లకూరు వేమయ్య తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధాశ్రమానికి రూ. 5 లక్షలు విరాళం



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం పట్టణంలో నిర్మిస్తున్న వృద్ధాశ్రమం నిర్మాణానికి సామర్లకోట అంబటి సుబ్బన అండ్ కో పరిశ్రమ యాజమాన్యం రూ. 5 లక్షలు విరాళాన్ని అందజే శారు. మంగళవారం ఈ విరాళాన్ని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరా జప్పకు యాజమాన్యం సింగవరపు సాయిబాబా, సత్యనారాయణ, విశ్వనాథ్‌లు చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెదేపా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్, నాయకులు రాజా సూరిబాబు రాజు, అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, బి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

# టెట్ పరీక్ష ఆఫ్ లైన్లో జరగాలి : యూటీఎఫ్ డిమాండ్

**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** టెట్ పరీక్ష ఆన్లైన్లో కాకుండా ఆఫ్ లైన్లో నిర్వహించాలని యుటిఎఫ్ జిల్లా కోశాధికారి, శ్రీకాళ హస్తి బాధ్యులు మోహన్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఎంఆర్సి కార్యాలయం వద్ద మంగళవారం టెట్ పరీక్షకు వ్యతిరేకంగా యుటిఎఫ్ డివిజన్ స్థాయి నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మోహన్ బాబు మాట్లాడుతూ ఉపా ధ్యాయులందరికీ క్వాలిఫైయింగ్ మార్కులు సమానంగా ఉం డాలన్నారు. ఏ సబ్జెక్టుకు సంబంధించిన వారికి ఆ సబ్జెక్టులోనే పరీక్ష నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు కుమార్ స్వామి, జిల్లా కార్యదర్శి విజయశ్రీ, ఆది నారాయణ, హేమాంబ రధరరావు, జీ.శ్రీనివాసులు తదితరులు



పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మండడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎల్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్కు 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# ఆ ఆలయ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తా : ఎంపీ శివనాథ్



**విజయవాడ, (రాజధాని వార్తలు):** శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం (పాత శివాలయం) నూతన ధర్మకర్తల ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), తెలుగుదేశం పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుద్ధా వెంకన్న, నాగుల్ మీరా, జనసేన పార్టీ నాయకులు అమ్మిశెట్టి వాసు, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ పాల్గొన్నారు.

**పాత శివాలయానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది..**

ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడారు. విజయవాడలోని పాత శివాలయానికి ఎంతో ప్రాముఖ్యం ఉందని తెలిపారు. ఈ ఆలయ అభివృద్ధికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని వ్యాఖ్యానించారు. ఈ ఆలయం వచ్చిన తర్వాతనే విజయవాడ అభివృద్ధి చెందడం ప్రారంభమైందని ప్రస్తావించారు. ఈ ప్రసిద్ధిగాంచిన ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ధర్మకర్తల మండలి ఏర్పాటు చేయాలని సూచించారు. నూతన ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులకు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

**ఆటోనగర్ ఐలా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రావడం చాలా ఆనందంగా ఉంది: ఎంపీ కేశినేని శివనాథ్**

అనంతరం విజయవాడ ఆటోనగర్ ఐలా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ సభలో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, బుద్దా వెంకన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడారు. ఆటోనగర్ ఐలా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రావడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. సుమారు లక్ష మంది కార్మికులు నివసించే ఈ ప్రాంతంలో ఐలా చాలా ప్రముఖ పాత్ర పోషిస్తూ ఉంటుందని చెప్పారు. గత ఐలా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆటోనగర్‌లో ఎన్నో కార్యక్రమాలు జరిగాయని వెల్లడించారు. గత రెండు సంవత్సరాల నుంచి ఐలా ఎలక్షన్స్ పెట్టాలని చెప్పి, అధికారంలోకి వచ్చాక ప్రతి నిత్యం పోరాడటం జరిగిందని చెప్పారు. కలెక్షన్స్ 60 శాతం దాటితేనే ఐలా ఎలక్షన్లు ఉంటాయని అధికారులు చెప్పడంతో, ఇప్పుడు అందరూ కూడా కలిసికట్టుగా ఉండి, కలెక్షన్స్ 60శాతం దాటించి ఎలక్షన్ కండక్ట్ చేసుకున్నారని తెలిపారు.

**ఆ సమస్యలను ఐలానే పరిష్కరించాలి..**

శాంతియుతంగా, ప్రశాంతంగా జరిగిన ఈ ఎలక్షన్లలో విజయం సాధించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు ఎంపీ శివనాథ్ చెప్పారు. ప్రెసిడెంట్: శివనాగేశ్వరరావు, వైస్ చైర్మన్: దుర్గాప్రసాద్, జనరల్ సెక్రటరీ: కలామ్, కార్యవర్గ సభ్యులు ఈ ఎలక్షన్లలో గెలిచిన వారందరికి కొన్ని సూచనలు చేస్తున్నానని అన్నారు. విజయవాడకే జీవనాడి ఆటోనగర్ అని తెలిపారు. ఈ జీవనాడి అయిన ఆటోనగర్‌లో రోడ్లు గానీ, డ్రైనేజీలు గానీ, మంచినీటి సమస్య గానీ ఏది ఉన్నా సరే.. ఐలానే పరిష్కరించాలని అన్నారు. ప్రజాప్రతినిధులందరం కూడా ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే తప్పకుండా పరిష్కరిస్తామని చెప్పారు. సిఆర్‌డిఏలో పోరాడి 3 రోడ్ల టెండర్లు పూర్తి చేశామని, ఇప్పటికే పనులు జరుగుతున్నాయని ఎంపీ శివనాథ్ వెల్లడించారు. 4వ రోడ్డు గద్దె రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో ప్రారంభించారని చెప్పారు. శక్తి కళ్యాణ మంటపం రోడ్డు కూడా రెడీ అయ్యిందని తెలిపారు. 24 గంటలు వాహనాలు ఆటోనగర్‌కి వచ్చి, విజయవాడకి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఉండే విధంగా తామందరం కృషి చేస్తామని చెప్పారు. రాబోయే కాలంలో ఐలా మరింత విస్తృతంగా అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. లక్ష మంది కార్మికులకు దిశా నిర్దేశం చేసే విధంగా ఉండాలని ఎంపీ శివనాథ్ కోరారు.

# చింతూరులో ఓఎస్డీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టులు



**పోలవరం, (రాజధాని వార్తలు):** జిల్లాలోని చింతూరు పోలీస్ స్టేషన్‌లో ముగ్గురు మావోయిస్టులు లొంగిపోయారు. చింతూరు ఓఎస్డీ పంకజ్ కుమార్ మీనా ఎదుట వీరు లొంగిపోయినట్లు పోలీస్ వర్గాలు వెల్లడించాయి. వీరిలో ఒక మహిళా మావోయిస్టు కూడా ఉన్నారని తెలిపాయి. వీరి పేర్లు.. ముచ్చిక లక్ష్మి, కదిటి వెంక, కదిటి లక్షయ్య అని వివరించాయి. ఛత్తీస్‌గఢ్ కేంద్రంగా పని చేస్తూ.. గతంలో పలు హింసాత్మక కర్యకలాపాలతో సంబంధం ఉన్నట్లు పేర్కొన్నాయి. వీరి మీద పలు కేసులు కూడా నమోదయి ఉన్నాయని చెప్పాయి. హింసాయుత మార్గాన్ని వీడి జనజీవన ప్రవంతిలో కలిసేందుకు వీరు ముందుకు వచ్చారని చింతూరు ఓఎస్డీ పంకజ్ కుమార్ మీనా ఈ సందర్భంగా తెలిపారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వ పునరావాస విధానాల అనుగుణంగా సహాయం అందించే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు.

ఈ ఏడాది మార్చి 31వ తేదీ నాటికి దేశంలో మావో యిస్టులను నిర్మూలించేందుకు కేంద్రం ఆపరేషన్ కగార్ తీసుకు వచ్చింది. దీంతో వందలాది మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. అలాగే పలువురు అరెస్టయ్యారు. ఇక ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో భద్రతా బలగాలు చేపట్టిన కూంబింగ్‌లో భారీగా మావోయిస్టులు హతమయ్యారు. ఈ నేపథ్యంలో ఆపరేషన్ కగార్.. మంచి ఫలితం ఇచ్చిందని కేంద్రం స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

# లారీల్లో బ్యాటరీలు చోరీ

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట పట్టణంలో రాత్రి పూట పార్కింగ్ చేసిన మూడు లారీల్లో ఉన్న సెల్ఫ్ బ్యాటరీలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. స్థానికంగా ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో క్రైస్ట్ లూథరన్ చర్చి ప్రక్క రోడ్డులో ఉన్న లారీ వర్కుషాప్ వద్ద ఉంచిన మూడు లారీల్లోని సెల్ఫ్ బ్యాటరీలు అపహరించినట్టు లారీల యజమానులు ఆందోళన చెందారు. వాటి విలువ సుమారు రూ. 60 వేలు ఉండవచ్చునని చెప్పారు. ఈ చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేయనుండగా దొంగల ఆచూకీ తెలుసుకుని న్యాయం చెయ్యాలని ఈ సందర్భంగా భాధిత యజమానులు కోరుతున్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan